

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 19-08-2025 | సంపుటి - 24 | సంచిక - 103 | రూ : 4 | పేజీలు: 8


## నరేంద్ర మోదీతో శుభాంశు శుక్లా భేటీ..

### ప్రధానికి వ్యోమగామి అపురూప కానుక



2లో

- ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయిన వ్యోమగామి శుభాంశు శుక్లా



2లో

## గత ప్రభుత్వం చేసిన చట్టమే మనకు అడ్డంకి

### : సీఎం రేవంత్‌రెడ్డి

- పాపన్న గౌడ్ విగ్రహానికి శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి
- బహుజనుల సామ్రాజ్యాన్ని అందరికీ ఎలా అందించవచ్చో పాపన్నగౌడ్ నిరూపించారన్న సీఎం
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారన్న ముఖ్యమంత్రి



# భారత్‌కే భవిష్య నగరం...

- 765చ.కి.మీ. విస్తీర్ణంలో 'ఫ్యూచర్ సిటీ' అభివృద్ధి
- పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట
- నివాసాలకు చేరువలోనే విద్య, ఉద్యోగ, వినోద సంస్థలు
- అత్యాధునిక అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మాణం
- ప్రాథమిక మాస్టర్ ప్లాన్ రూపకల్పన
- ముఖ్యమంత్రి ఆదేశాలతో తుది మెరుగులు

హైదరాబాద్: భారతదేశానికే తలమానికంగా ఉండేలా.. రేపటి పౌరులకు మేలిమి భవిష్యత్తునిచ్చే నగరంగా.. 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. హైదరాబాద్ దక్షిణ ప్రాంతంలో 765 చ.కి.మీ. విస్తీర్ణంలో ఈ నగరాన్ని నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకోసం 'భవిష్య నగర అభివృద్ధి సంస్థ'(ఎఫ్‌సీడీఏ)ను ఏర్పాటు చేసింది. తెలంగాణ అర్బన్ ఏరియాస్ (డెవలప్‌మెంట్) యాక్ట్ 1975 కింద ఇది పనిచేస్తుంది. ప్రస్తుత జీహెచ్‌ఎంసీ సరిహద్దులకు అవతల ఏర్పాటవుతున్న ఈ జోన్‌ను.. భావితరాలకు స్థిరమైన, సమ్మిళిత నగరంగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ లక్ష్యం. 'ఫ్యూచర్ సిటీ'లో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయనున్నారు. నివాస సముదాయాల నుంచి కాలినడకన చేరుకునేంత దూరంలోనే విద్య, వైద్య, ఉపాధి, ఉద్యోగ, వినోద సంస్థలు ఉండేలా ప్రణాళికలు రూపొందించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో.. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న ఈ నగరానికి సంబంధించిన ప్రాథమిక మాస్టర్ ప్లాన్‌ను అధికారులు రూపొందించారు. దీనిపై ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఉన్నతస్థాయిలో సమీక్ష సమావేశం జరిగింది. నిర్మాణ ప్రణాళికలపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. ఆయన ఆదేశాలతో తుది మెరుగులు దిద్ది.. త్వరలోనే పూర్తిస్థాయి ప్రణాళికను ప్రకటించడానికి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది.

### వ్యూహాత్మక ఏర్పాటు

ఔటర్ రింగ్ రోడ్, శ్రీశైలం హైవే, నాగార్జునసాగర్ హైవేలతో సరిహద్దుగా ఉన్న కీలకమైన అభివృద్ధి కారిడార్‌ను 'ఫ్యూచర్ సిటీ' కవర్ చేస్తుంది. ఇది రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉంది. ఒకేచోట విశాలమైన భూమి.. ఇప్పటికే ఉన్న పారిశ్రామిక సంస్థలతో తెలంగాణ భవిష్య నగర ఆర్థిక శక్తికి ఈ ప్రాంతం కేంద్రంగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. హైదరాబాద్ మహానగరంపై ఒత్తిడిని తగ్గించడం, స్మార్ట్ మౌలిక సదుపాయాలు, స్థిరమైన జీవనం, వేగవంతమైన ఆర్థిక వృద్ధితో ప్రణాళికాబద్ధంగా ప్రత్యామ్నాయాన్ని అందించడం... ఫ్యూచర్ సిటీ

తరువాయి 2లో



రామంతాపూర్ ఘటన.. మృతుల కుటుంబాలకు

## రూ.5 లక్షల పరిహారం

2లో



వినాయకుడి మండపానికి రూ.474 కోట్లకు

## ఇన్సూరెన్స్

లోపలి పేజీలో

## హెచ్‌సీఏ అక్రమాల్లో కేటీఆర్, కవితలది కీలక పాత్ర

### తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి




- హెచ్‌సీఏ అవకతవకల్లో క్విడ్ ప్రోకో జరిగిందన్న గురువారెడ్డి
- సీఐడీ దర్యాప్తులో చాలా విషయాలు వెలుగులోకి వస్తున్నాయని వెల్లడి
- కేటీఆర్ బంధువు రాజ్ పాకాలకు టిక్కెట్ల కాంట్రాక్టు ఇచ్చారని విమర్శ

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అక్రమాల వ్యవహారంలో మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత కీలక పాత్ర పోషించారని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి

తరువాయి 2లో

## కొత్త ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వండి

### : నిర్మలా సీతారామన్ కు మంత్రి లోకేశ్ విజ్ఞప్తి



6లో

## రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు.. భారత్‌కు అమెరికా తీవ్ర హెచ్చరిక

- భారత్ చర్య ఉక్రెయిన్ యుద్ధానికి నిధులు సమకూర్చినట్లేనని ఆరోపణ



6లో

# గత ప్రభుత్వం చేసిన చట్టమే మనకు అడ్డంకి: సీఎం

హైదరాబాద్ : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం తెలంగాణ సమాజానికి ఆదర్శంగా నిలబడాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ట్యాంక్‌బండ్ సమీపంలో పాపన్నగౌడ్ విగ్రహానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. బహుజనుల సామ్రాజ్యాన్ని అందరికీ ఎలా అందించవచ్చో పాపన్నగౌడ్ నిరూపించారన్నారు. పాపన్నగౌడ్ కోటను గత ప్రభుత్వాలు మైనింగ్ లీజుకు ఇచ్చాయని విమర్శించారు. గతంలో ఖిలాస్‌పూర్ కోటను కాలగర్భంలో కలపాలని చూశారని దుయ్యబట్టారు. చరిత్ర స్ఫూర్తి కోటను చారిత్రక కట్టడాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించామన్నారు. భవిష్యత్తు తరాలు స్ఫూర్తి పొందేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. "గాంధీ కుటుంబం దేశానికి గొప్ప వరం. శాంతితో యుద్ధాన్ని గెలవవచ్చు అని గాంధీ నిరూపించారు. దేశం కోసం ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణాలర్పించారు.



దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సోనియాగాంధీ పదవులు త్యాగం చేశారు. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు ఆ కుటుంబం గొప్ప నాయకత్వాన్ని అందించింది. ప్రపంచ వ్యాప్తంగా భారత్‌ను గుర్తించినట్లే.. గాంధీ కుటుంబాన్ని గుర్తిస్తున్నారు. ఆ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న మన ప్రభుత్వం ప్రపంచానికి ఆదర్శం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని గతంలో రాహుల్ గాంధీ మాట ఇచ్చారు. గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలాశాసనమే. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా తెలంగాణలో కులగణన సర్వే చేశాం. అందులో తప్పులుంటే చూపాలని దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు శాసనసభ వేదికగా సవాల్ విసిరాం. తప్పులు చూపితే క్షమాపణ చెబుతామని చెప్పాం. రాజకీయ ప్రయోజనాల కోసం కులగణను తప్పుపట్టవద్దు. దీన్ని తప్పుపడితే వందేళ్ల వరకు బహుజనులకు న్యాయం జరగదు. బీసీ రిజర్వేన్ల బిల్లును ఐదు నెలలుగా కేంద్రం పెండింగ్‌లో పెట్టింది. బీసీతో పాటు ఎస్సీ, ఎస్టీ కలిపితే 70 శాతం వరకు చేరుతాయి. తెలంగాణలో 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇవ్వకుండా గత ప్రభుత్వం చట్టం చేసింది. గత ప్రభుత్వం చేసిన చట్టం మనకు అడ్డంకిగా మారింది." అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## రామంతాపూర్ ఘటన.. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం

హైదరాబాద్ : రామంతాపూర్‌లోని గోఖలేనగర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపు రథానికి విద్యుత్ తీగలు తగిలి ఆరుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. మృతుల కుటుంబాలను సోమవారం మంత్రి శ్రీధర్ బాబు పరామర్శించారు. రూ.5 లక్షల నష్టపరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి ఊరేగింపు చేపట్టారు. రథాన్ని లాగుతున్న వాహనం మరమ్మతుకు గురికావడంతో దాన్ని పక్కన నిలిపివేసిన యువకులు.. రథాన్ని చేతులతో లాగుతూ ముందుకు



తీసుకెళ్లారు. ఈ క్రమంలో రథానికి విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో రథాన్ని లాగుతున్న తొమ్మిది మందికి షాక్ కొట్టడంతో వారంతా ఒక్కసారిగా విసిరేసినట్లు దూరంగా పడిపోయారు. ఈ క్రమంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు.

## వినాయకుడి మండపానికి రూ.474 కోట్లకు ఇన్సూరెన్స్

ముంబయి : గణపతి నవరాత్రి ఉత్సవాలకు యావత్ దేశం సిద్ధమవుతోంది. విభిన్న ఆకృతుల్లో కొలువుదీరే వినాయకుల కోసం మండపాలను ముస్తాబు చేయనున్నారు. ఖరీదైన గణేశ్‌మూర్తులు, భారీ సెట్టింగ్‌లతో తాత్కాలిక మండపాలు ప్రతి ఏటా ఆకర్షణగా నిలుస్తుంటాయి. ఈ నేపథ్యంలో ముంబయిలోని ఓ గణేశ్ మండపానికి ఏకంగా రూ.474.46 కోట్లకు ఇన్సూరెన్స్ చేయించారని జాతీయ మీడియా కథనం పేర్కొంది. ముంబయి శివారులోని మతుంగా ప్రాంతంలో గత ఏడు దశాబ్దాలుగా జీఎస్‌బీ సేవామండల్ వినాయక చవితి వేడుకలను ప్రత్యేకంగా నిర్వహిస్తోంది. ఈసారి 71వ వార్షికోత్సవం జరగనుంది. దేశంలోనే సంపన్న వినాయకుడిగా పేరొందిన ఈ విఘ్నేశ్వరుడి వేడుకలకు ఈ ఏడాది ఏకంగా రూ.474.46 కోట్లకు బీమా చేయించారట. ఇక్కడి విగ్రహాన్ని భారీఎత్తున బంగారం, వెండి ఆభరణాలతో అలంకరించనుండటమే అందుక్కారణం. గతేడాది సైతం ఈ గణేశ్ మండపానికి రూ.400.58 కోట్లకు బీమా చేయించినట్లు నిర్వాహకులు మీడియాకు వెల్లడించారు. ప్రస్తుతం పూజారులు, నిర్వాహకులు, సహాయకులు, భద్రతా సిబ్బందికి రూ.375 కోట్లకు వ్యక్తిగత ప్రమాద బీమా తీసుకున్నారు. గణపయ్యకు అలంకరించే బంగారం, వెండి, ఆభరణాలకు రూ.67 కోట్ల బీమా వర్తించనుంది. 2023, 2024ల్లో ఆ మొత్తం రూ.38 కోట్లు, రూ.43 కోట్లుగా ఉంది. అగ్నిప్రమాదం, భూకంపం ముప్పు వంటి వాటికోసం ప్రత్యేకంగా మరో రెండు కోట్ల రూపాయల బీమా తీసుకున్నారు. అక్కడి ఫర్నీచర్, కంప్యూటర్లు, సీసీటీవీలు, స్కానర్లు ఇన్సూరెన్స్ పరిధిలో ఉన్నాయి. పబ్లిక్ లయబిలిటీ ఇన్సూరెన్స్ కింద రూ.30 కోట్లు కేటాయించారు. భక్తుల సౌలభ్యం కోసం క్యూఆర్ కోడ్, డిజిటల్ లైవ్ సేవలను కూడా నిర్వాహకులు అందుబాటులోకి తెచ్చారు. భద్రతా చర్యల్లో భాగంగా ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలను కూడా ఏర్పాటుచేశారు.

## హెచ్‌సీఏ అక్రమాల్లో కేటీఆర్, కవితలది కీలక పాత్ర

(మొదటిపేజీ తరువాయి)

గురువారెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హెచ్‌సీఏ అవకతవకల్లో క్విడ్‌ప్రోకో జరిగిందని ఆయన అన్నారు. సీఐడీ దర్యాప్తులో చాలా విషయాలు వెలుగులోకి వస్తున్నాయని వెల్లడించారు. అన్ని రాష్ట్రాల అసోసియేషన్లు నిబంధనలు పాటించాలని బీసీసీఐ చెప్పిందని వెల్లడించారు. కోర్టుల్లో కేసులు వేస్తూ హెచ్‌సీఏ అవకతవకలకు పాల్పడిందని విమర్శించారు. కమిటీలలో మంత్రులు ఉండకూడదని చెప్పినప్పటికీ, బీసీసీఐ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సబ్ కమిటీలో కేటీఆర్ కొనసాగారని ఆరోపించారు. కేటీఆర్ బంధువు రాజ్ పాకాలకు బీసీసీఐ టిక్కెట్ల కాంట్రాక్టు ఇచ్చారని ఆయన అన్నారు. పదేళ్ల నుంచి ఒకే ఆడిట్ రిపోర్టును ప్రతిసారి కాపీ పేస్ట్




చేసి, దానిని పాస్ చేస్తూ అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రతి సంవత్సరం క్లబ్బుల అభివృద్ధికి రూ. 6.10 కోట్లు ఇస్తున్నారని, అయితే టీమ్‌లు లేని క్లబ్బులకు కూడా ఇచ్చారని ఆయన అన్నారు. హెచ్‌సీఏ పరిపాలనా వ్యవహారాలకు కూడా నెలకు రూ. 12 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. నెలకు అంత మొత్తంలో ఎలా ఖర్చు చేశారని గురువారెడ్డి ప్రశ్నించారు.

## కోటి మందికి ఏఐ ఆధారిత పౌర సేవలు: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్: కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత పౌర సేవలను 2027 నాటికి రాష్ట్రంలోని కోటి మంది ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. 'ఏఐ క్యాపిటల్ ఆఫ్ ది గ్లోబ్‌గా తెలంగాణ'ను తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐ సిటీ, ఏఐ విశ్వవిద్యాలయం, తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నామని వెల్లడించారు. ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ (ఐటీ శాఖ) ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని డా.ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ సంస్థలో మూడు రోజులపాటు నిర్వహించనున్న 'ఏఐ లెడ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌ఛాంపియన్స్ అండ్ కాటలిస్ట్స్ ప్రోగ్రామ్' శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్‌ను ప్రారంభించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాం. ఇదే స్ఫూర్తితో 20 ప్రభుత్వ శాఖలకు చెందిన 300 రకాల పౌర సేవలను ఏఐ ఆధారిత వేదికపై అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ఆ శాఖల నుంచి 250 మంది అధికారులను ఎంపిక చేసి ఏఐ వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. వీరికి 3 నెలల పాటు ఏఐ నిపుణులు మార్గదర్శకత్వం చేస్తారు' అని వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్, ఉప కార్యదర్శి భవేశ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్ర మోదీతో శుభాంశు శుక్లా భేటీ... ప్రధానికి వ్యోమగామి అపురూప కానుక

- **ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయిన వ్యోమగామి శుభాంశు శుక్లా**
- **అంతరిక్షంలోకి తీసుకెళ్లిన జాతీయ జెండాను ప్రధానికి బహూకరణ**
- **తన యాత్ర అనుభవాలను, ప్రయోగాల వివరాలను పంచుకున్న శుక్లా**
- **వ్యోమగామిని అభినందించిన ప్రధాని మోదీ**
- **పార్లమెంటులోనూ శుభాన్షు శుక్లాపై ప్రశంసల వర్షం**

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ISS)లో భారత కీర్తి పతాకాన్ని ఎగురవేసిన భారత వ్యోమగామి, వాయుసేన టెస్ట్ పైలట్ గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. దేశ రాజధానిలోని ప్రధాని అధికారిక నివాసంలో జరిగిన ఈ సమావేశంలో, శుక్లా ఒక అపురూపమైన కానుకను మోదీకి అందజేశారు. తన చారిత్రాత్మక 'యాక్స్ 4' మిషన్‌లో భాగంగా అంతరిక్షంలోకి తీసుకెళ్లిన త్రివర్ణ పతాకాన్ని ఆయన ప్రధానికి బహూకరించారు. మానవసహిత అంతరిక్ష యాత్రలో భారత్ సాధిస్తున్న ప్రగతికి ఈ ఘటన ప్రతీకగా నిలిచింది. ఈ సందర్భంగా శుభాంశు శుక్లా తన అంతరిక్ష యాత్రలోని ఉత్కంఠభరిత క్షణాలను, ఎదురైన సవాళ్లను ప్రధానికి వివరించారు. అంతర్జాతీయ వ్యోమగాములతో కలిసి సుదీర్ఘకాలం అంతరిక్ష కేంద్రంలో గడిపిన అనుభవాలను పంచుకున్నారు. అక్కడ గురుత్వాకర్షణ లేని స్థితిలో మానవ శరీరంపై కలిగే మార్పులు, స్పేస్‌లో వ్యవసాయానికి సంబంధించిన టెక్నాలజీ వంటి కీలకమైన శాస్త్రీయ ప్రయోగాల వివరాలను తెలియజేశారు. ఈ ప్రయోగాలు భవిష్యత్తులో భారత్ చేపట్టనున్న ప్రతిష్ఠాత్మక 'గగన్‌యాన్' మిషన్‌కు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. శుక్లా సాహసాన్ని, దేశభక్తిని ప్రధాని మోదీ ప్రశంసలతో ముంచెత్తారు. కేవలం సాంకేతిక విజయాన్నే కాకుండా, యువతరంలో స్ఫూర్తిని రగిలించారని అభినందించారు. మరోవైపు, పార్లమెంటు సైతం శుభాంశు శుక్లా చారిత్రాత్మక విజయంపై ప్రశంసలు కురిపించింది. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. భారత అంతరిక్ష ప్రయోగాల చరిత్రలో శుక్లా మిషన్ ఒక సువర్ణాధ్యాయమని కొనియాడారు. అయితే ఈ ప్రత్యేక చర్చలో ప్రతిపక్షాలు పాల్గొనలేదు. కానీ కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ 'ఎక్స్' వేదికగా శుక్లాను అభినందించారు. "ప్రతి భారతీయుడు గర్వపడేలా శుభాంశు శుక్లా ఈ యాత్రను పూర్తి చేశారు. మన గగన్‌యాన్ కార్యక్రమానికి ఇది ఒక కీలకమైన మైలురాయి" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

## భారత్‌కే భవిష్య నగరం...

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్యం. ఈ నగరాన్ని 'తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కార్పొరేషన్(టీజీఐఐసీ)' అభివృద్ధి చేస్తుంది. ప్రఖ్యాత అంతర్జాతీయ సంప్రదింపు సంస్థ సహాయంతో మాస్టర్ ప్లానింగ్ రూపకల్పన శరవేగంగా జరుగుతోంది.

పర్యావరణ స్థిరత్వం.. జీవావరణ సంరక్షణ

ఆధునిక పర్యావరణ పద్ధతుల ద్వారా జీవావరణ సంరక్షణ, మెరుగుదలపై మాస్టర్ ప్లాన్‌లో దృష్టి సారిస్తున్నారు. పారిశ్రామిక, నివాసిత ప్రాంతాల్లో వర్షపు నీటి నిర్వహణ కోసం స్పాంజ్ పార్కులు నెలకొల్పుతారు. ఇవి నీటిని గ్రహించి, వరదలను నివారిస్తాయి. రోజువారీ నీటి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని.. పునర్వినియోగ నీటి పద్ధతిని అమలు చేస్తారు. జీరో లిక్విడ్ డిశ్చార్జ్‌పై దృష్టి పెడతారు. ఇది వర్షపు నీటి సేకరణ, పునర్వినియోగ వ్యవస్థల ద్వారా నీటి కొరతను సమర్థంగా తీర్చుతుందని, బయటి నుంచి నీటిని సరఫరా చేసుకోవడాన్ని తగ్గిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. విద్యుత్



అవసరాల కోసం అధిక సామర్థ్య సబ్‌స్టేషన్లను నిర్మించనున్నారు. పారిశ్రామిక జోన్‌లు, వ్యాపార కేంద్రాల మధ్య గ్రీన్ కారిడార్ బఫర్‌గా పనిచేస్తుంది. విశాలమైన నగర అటవీ, పాకెట్ పార్కుల నెట్‌వర్క్‌తో 'భవిష్య నగరం' హరిత వాతావరణాన్ని బలోపేతం చేస్తుంది. నివాస సముదాయాల నిర్మాణంలోనూ ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నారు. ఈ క్లస్టర్‌లు వాక్‌టువర్క్ జీవనశైలిని అందించేలా రూపొందించారు. సమీపంలోని రిజర్వ్ అటవీ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దనున్నారు. వీటికి తోడుగా.. ఇప్పటికే ఉన్న జలవనరులు, జంతు ప్రదర్శనశాల, ఎకో టూరిజం జోన్‌లను సంరక్షిస్తారు. పర్యాటకం, వ్యాపార సందర్శనలను ప్రోత్సహించడంలో భాగంగా ఫ్యూచర్ సిటీ సరిహద్దు వెంట.. అనేక హోటళ్లు, రిసార్టులనూ ప్రణాళికలో పొందుపర్చారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, ఈవేస్ట్ డిస్పోజల్ మెకానిజమ్స్, కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లతో ఫ్యూచర్ సిటీ సన్నద్ధమవుతుంది. ఇవి అన్ని రకాల వ్యర్థాల నిర్వహణను సమర్థంగా నిర్వహిస్తాయి.

## రేపు తెలంగాణలోని పలు జిల్లాల్లో అతి భారీ వర్షాలు

- **వెల్లడించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం**
- **అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో విస్తారంగా వర్షా లు**
- **ఉత్తర, ఈశాన్య జిల్లాల్లో భారీ వర్షా లు కురిసే అవకాశం**

తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈరోజు, రేపు మోస్తరు నుంచి భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కాసేపట్లో అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం మధ్యాహ్నం వాయుగుండం తీరాన్ని దాటే సమయంలో ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈరోజు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల తదితర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. రేపు ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడుతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

## అమరావతిపై పదే పదే అదే విషం

- **తాజా వర్షా లకు రాజధాని మునిగిందంటూ వైకాపా దుష్ప్రచారం**
- **ఆ విష ప్రచారాన్ని భుజానికెత్తుకుంటున్న మరికొందరు**
- **తాజాగా తిరుపతిలో ఆడిట్ విభాగం అధికారి విద్వేషకర వ్యాఖ్యలు**

అమరావతి, తిరుపతి: రాజధాని అమరావతిపై వైకాపా నాయకుల్లో ఇప్పటికీ అదే అక్కసు.. అదే కడుపుమంట..అమరావతిపై విషం కక్కడమే ఇప్పటికీ వారి ఏకైక ఎజెండా..! ఐదేళ్ల జగన్ పాలనలో అమరావతిని నామరూపాల్లేకుండా చేసేందుకు పన్నిన కుట్రలేవీ పారలేదు. అమరావతి శ్మశానమని, ఎడారి అని, గట్టిగా వర్షం పడితే అమరావతి మునిగిపోతుందని, నిర్మాణాలకు అక్కడి నేల పనికిరాదని... ఆ ఐదేళ్లూ అప్పటి మంత్రులు, ఆ పార్టీకి తాబేదారులుగా వ్యవహరించినవారు వివిధ మాధ్యమాల్లో విష ప్రచారం చేశారు. ఎగువ నుంచి వరదనీరు పోటెత్తుతున్నా ప్రకాశం బ్యారేజీ వద్ద నీటిని కిందకి విడుదల చేయకుండా జాప్యం చేసి అమరావతిని ముంచేసేందుకూ కుట్ర పన్నారు. అయినా వారి ఆటలేమీ సాగలేదు. తాజాగా కురిసిన వర్షాలకు అమరావతి మునిగిపోయిందంటూ మళ్లీ వైకాపా వర్గాలు, జగన్‌కు చెందిన పత్రిక, టీవీ ఛానల్ ఉద్దేశపూర్వకంగా విషప్రచారాన్ని భుజాలకెత్తుకున్నాయి. కొందరు ప్రభుత్వ ఉద్యోగులూ సర్వీసు నిబంధనలకు విరుద్ధంగా అమరావతిపై విషప్రచారానికి పూనుకుంటున్నారు. విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. వాణిజ్య పన్నులశాఖ తిరుపతి ప్రాంతీయ ఆడిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో అసిస్టెంట్ కమిషనర్ (ఎఫ్ఏసీ)గా పనిచేస్తున్న ఎస్.సుభాష్ చంద్రబోస్ అమరావతిపై అవాస్తవాలు ప్రచారం చేస్తూ ఫేస్‌బుక్‌లో సోమవారం వివాదాస్పద పోస్టులు పెట్టడం ఆయన క్రమశిక్షణారాహిత్యానికి అద్దంపట్టింది. అమరావతిలో ప్రస్తుత పరిస్థితి ఏంటో కనీసం చూడకుండా ఇష్టానుసారం కామెంట్లు పెట్టేశారు.

- **భారీ వర్షం కురిస్తే పునాదుల గోతుల్లోకి నీళ్లు రావా?**

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందంటే చాలు అమరావతి మునిగిపోయిందంటూ జగన్ మీడియా, వైకాపా నాయకులు ప్రచారం మొదలు పెట్టేస్తున్నారు. తాజాగా అమరావతి, చుట్టుపక్కల ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి కొండవీటివాగు



పోటెత్తింది. అమరావతి మీదుగా వెళ్లే ఆ వాగు వెళ్లి ప్రకాశం బ్యారేజీ ఎగువన కృష్ణా నదిలో కలుస్తుంది. అమరావతి 'బ్లూగ్రీన్' సిటీ కాన్సెప్ట్‌లో కొండవీటి వాగునీ ఆధునికీకరించనున్నారు. ప్రస్తుతం అమరావతి నిర్మాణ పనులు జరుగుతుండటంతో వాగు ప్రవాహానికి అక్కడక్కడా అడ్డంకులు ఉండటం, వాగు ఆధునికీకరణ పనులు ఇంకా జరగకపోవడంతో వాగులో నీరు వెనక్కి ఎగదన్ని పెదపరిమినీరుకొండ మధ్యలో పొలాలు కొంత నీట మునిగాయి. కొన్ని దశాబ్దాలుగా కొండవీటివాగుకు ఒక్కసారిగా వరద నీరు పోటెత్తినప్పుడు తాడికొండ మండలంలో పంటపొలాలు కొంత మునుగుతుంటాయి. నాలుగైదు రోజుల్లో ఆ నీరు వెళ్లిపోతుంది.

# పేదల చిరకాల వాంఛ నెరవేరుతోంది

* భద్రాద్రి రాముని సాక్షిగా చరిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం
* లక్ష మందితో జరగనున్న ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ మహోత్సవం
* బెండలంపాడు గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా 27 ఇళ్ల గృహప్రవేశం..
* ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలనలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి..



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండలంపాడు గ్రామం లో ఈ నెల 21న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలకు హాజరుకానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార , పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజు, అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య, వైరా శాసనసభ్యులు రామదాస్ నాయక్, సత్తుపల్లి శాసనసభ్యులు మట్టరాగమయి తో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గడిచిన పది సంవత్సరాల కాలంలో పేదలకు ఇల్లు అన్న కల కలగానే మిగిలిపోయింది అని అన్నారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఇందిరమ్మ పథకాన్ని పునఃప్రారంభించి, మొదటి విడతగా రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇండ్ల మంజూరుతో పేదవాడి చిరకాల వాంఛను ఈ పేదోడి ప్రభుత్వం అయినా ఇందిరమ్మ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ఈ శ్రావణ మాసం, 21వ తేదీన శుభ ముహూర్తంలో ముఖ్యమంత్రి స్వయంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చంద్రుగొండ మండలం బెండలంపాడు గ్రామం లో గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు అని తెలిపారు. ఈ గ్రామంలో మొత్తం 312 ఇండ్లు మంజూరయ్యగా, వాటిలో 72 ఇండ్లు పూర్తి అయ్యాయి. అందులో 27 ఇండ్లకు ముఖ్యమంత్రి చేతుల మీదగా గృహప్రవేశం జరగనుంది. గతంలో ఏ పేదవాడికీ అందని ఇళ్లను ఇప్పుడు ఈ ప్రభుత్వం పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా ప్రతి అర్హునికి అందజేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 22,500 కోట్ల రూపాయలతో 4.5 లక్షల ఇళ్లలో, సుమారు 2.5 లక్షల ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. మిగిలిన ఇళ్లు కూడా ఇందిరమ్మ కమిటీల ద్వారా పారదర్శకంగా అర్హులైనవారికి ఎంపిక చేసి మంజూరు పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. భద్రాద్రి రాముని సన్నిధిలో గతంలో ఈ పథకాన్ని ప్రారంభించాం. ఈరోజు అదే భద్రాద్రి నేలపై ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం జరగడం ఒక చారిత్రక ఘట్టం అని తెలిపారు. జిల్లాలో జరిగే ఈ మహోత్సవానికి సుమారు ఒక లక్ష మంది ప్రజలు పాల్గొంటారని అంచనా. కాబట్టి, కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని గొప్ప విజయవంతం చేయాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను అన్నారు. 20వ తేదీ మధ్యాహ్నం నుంచే ఇక్కడ ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తాను అని మంత్రి తెలిపారు . అధికారులు చిన్నచిన్న తప్పిదాలు కూడా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అనారు. పేదవాడి కలలను నిజం చేసే ఈ గృహప్రవేశోత్సవాన్ని ఘనవిజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 21 మధ్యాహ్నం రెండు గంటలకు చంద్రుగొండకు ముఖ్యమంత్రి చేరుకుంటారని, 2:10 బెండలంపాడు చేరుకుని 2:20 కు లబ్ధిదారుల ఇళ్ల వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారని, ఒక్కో ఇంటి వద్ద 15 నిమిషాలపాటు లబ్ధిదారులతో మాట్లాడే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 2:50 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం 3:00 గంటల నుంచి ప్రజాసభలో పాల్గొని ప్రసంగిస్తారని వివరించారు. ఈ సందర్భంలో పోలీస్ బందోబస్తు, వీఐపీల ప్రోటోకాల్, ప్రజా రాకపోకల నియంత్రణ వంటి అంశాలపై ఎస్పీ వివరాలు తెలియజేశారు. రెవెన్యూ శాఖ అదనపు కలెక్టర్ మొత్తం సమన్వయం చేపడతారని, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. సమీపంలోని 30 కిలోమీటర్ల పరిధిలోని మండలాల నుండి ముఖ్యంగా మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్ ఎస్ జి ఎస్ ) సభ్యుల రాకపోకలపై ప్రత్యేక మొబిలైజేషన్ ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ప్రధాన శాఖలవారీగా తగిన ఏర్పాట్లు చేయాలని, బాధ్యతలు విభజించినట్లు కలెక్టర్ వివరించారు. రోడ్ల మరమ్మత్తులు, బురద తొలగింపు, పిచ్చి మొక్కల నివారణ, డోజర్లు వినియోగం, స్టోన్ డస్ట్ వేసే పనులు సమయానికి పూర్తిచేయాలని, వర్షాల వలన మళ్లీ సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. 19వ తేదీ సాయంత్రానికల్లా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, లైటింగ్, తాగునీరు, పార్కింగ్, ప్రజా సౌకర్యాలు, డయాస్ ఏర్పాటు, మీడియా కోసం ప్రత్యేక వేదిక, బారికేడింగ్, భద్రత వంటి అంశాలన్నీ విభాగాలవారీగా సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన రోజున ఎక్సైజ్, సిపిఓ, పోలీసు అధికారులు సమగ్రంగా పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్వయంగా విచ్చేసి గృహప్రవేశాలలో భాగస్వాములు కావడం గిరిజనుల పట్ల ప్రభుత్వ కట్టుబాటుకు నిదర్శనం అని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడం వలన ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని ఆయన అన్నారు. అధికారులందరూ తమ విధి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమం గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశలో ఒక చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం మంత్రి కలెక్టర్, ఎస్పీ , శాసన సభ్యులతో కలిసి హెలిపాడ్ , సభా ప్రాంగణం మరియు ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీజీ ఐ డి సి చైర్మన్ మొవ్వ విజయ్ బాబు, అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, ట్రైన్ కలెక్టర్ సౌరబ్ శర్మ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ఆర్డీవో మధు, అన్ని శాఖల జిల్లా అధికారులు , ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఖాజీపల్లిలో ఘనంగా బోనాలు



జిన్నారం, ప్రజాస్ఫూర్తి 17: సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని ఖాజిపల్లి గ్రామంలో గల పెద్దమ్మ తల్లి దేవాలయం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి, సీఐ రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచులు సత్యనారాయణ, నరసింహ, నవీన్ కుమార్, గ్రామ పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## కన్సాన్‌పల్లిలో శ్రావణ మాస పూజలు

* మాణిక్య ప్రభు మందిరంలో లింగాభిషేకం



అందోలు, ప్రజాస్ఫూర్తి : అందరూ అత్యంత పవిత్రంగా భావించే శ్రావణమాసాన్ని పురస్కరించుకొని అందోలు మండల పరిధిలోని కన్సాన్‌పల్లి గ్రామంలోని మాణిక్యప్రభు మందిరంలో శ్రావణ సోమవారం సందర్భంగా జోగిపేట ఏయంసీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్‌రెడ్డి, సురేఖ, శేరి నాగార్జునరెడ్డి దంపతుల చేతుల మీదుగా గ్రామ పురోహితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, శివ లింగానికి అభిషేకం వంటి పూజలు నిర్వహించారు. నీలకంఠేశ్వరుని కృపాకటాక్షాలు గ్రామ ప్రజలందరిపై ఉండి అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంటలతో రైతులు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ పూజా కార్యక్రమంలో గ్రామస్తులు ముఖ్యంగా మహిళ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కొబ్బరి కాయలు కొట్టి శివలింగాన్ని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నధాన కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిల భక్తులకు తాంబులాలు అందజేశారు. కార్యక్రమంలో అక్సాన్‌పల్లి పిఏసిఎస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి, కాంగ్రేస్ పార్టీ మండ అధ్యక్షుడు శివరాజ్, మాజీ ఎంపిటీసీలు బాలయ్య, రాజిరెడ్డి, రమేశ్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, నాగభూషణం, హన్మంతు, కిషన్, నర్సింలు, వెంకయ్య, రుక్మారెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.



## భారీ వర్షంలో అంగన్వాడీల ధర్నా

* ప్రీ ప్రైమరీ విద్యను అంగన్వాడీ కేంద్రాలకే అప్పగించాలి




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం భారీ వర్షాన్ని లెక్కచేయకుండా అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు ధర్నా నిర్వహించారు. ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీ విద్యను అంగన్వాడీ కేంద్రాలకే అప్పగించాలని, విద్యాబోధన బాధ్యతను అంగన్వాడీలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి, జిల్లా కార్యదర్శి జి.పద్మ మాట్లాడుతూ "ఐసిడిఎస్ వ్యవస్థను బలోపేతం చేసి, పోసన్ ట్రాకర్ యాప్‌లోని పేస్ క్యాప్చర్ (ఎఫ్‌ఆర్‌ఎస్) విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా వారు ఐసిడిఎస్ డిడబ్ల్యూఓ స్వర్ణలతకు వినతి పత్రం అందజేశారు. అంగన్వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా కొత్త జాతీయ విద్యా విధానం తీసుకొచ్చారని, 6 సంవత్సరాల లోపు పిల్లలకు విద్యతో పాటు పౌష్టికాహారం అందించేది అంగన్వాడీలే కాబట్టి, బాధ్యతలు విద్యాశాఖకు కాకుండా వారికి అప్పగించాలన్నారు. అలాగే అంగన్వాడీలకు అదనపు వేతనం చెల్లించాలని, బిఎల్ఓ తదితర అదనపు పనులను మానివేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 2జి సెల్‌ఫోన్లలో యాప్‌లు వాడమని అధికారుల బెదిరింపులు అన్యాయమని, బదులుగా నాణ్యమైన 5జి ఫోన్లు, ట్యాబులు, నెట్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ ధర్నాలో జిల్లా నాయకులు విజయశీలా, కళావతి, మరియా, రాధకుమారి, భానుశ్రీ, కృష్ణవేణి, హేమలత, సారమ్మ, ఫాతిమా, శైలజ, సావిత్రి, వీరభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో అధికారుల మొద్దు నిద్ర

* ప్రమాదకరంగా మ్యాన్ హోల్స్
* పొంచి ఉన్న ప్రమాదం
* ఇబ్బందులు పడుతున్న స్థానికులు
* సారూ సమస్య పరిష్కరించండి అంటున్న స్థానికులు:



ప్రజా స్ఫూర్తి, జగద్గిరిగుట్ట: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రజా సమస్యలను గాలికొదిలేస్తున్న కొందరు అధికారుల నిర్లక్ష్య దోరనితో ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా జగద్గిరిగుట్టలో జలమండలి అధికారుల పని తీరుపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లాస్ట్ బస్టాప్ నుండి శ్రీనివాస్ నగర్ వెళ్లే ప్రధాన రహదారిలో కిడ్స్ కేర్ హాస్పిటల్ ఎదురురుగా మ్యాన్ హోల్ ధ్వంసమై మూత లేకుండా ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించేఈ రహదారిలో మ్యాన్ హోల్ ప్రమాదకరంగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. చిన్నపిల్లలు మ్యాన్ హోల్ లో పడే ప్రమాదం పొంచి ఉందని వారం రోజులుగా సమస్య ఇదే స్థితిలో వున్నా వాటర్ వర్క్స్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మ్యాన్ హోల్ నుండి మురుగు నీరు ప్రవహిస్తూ దుర్గందం వెదజల్లుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజా ప్రతినిధులైనా, ప్రభుత్వ ప్రతినిధులైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## విద్యార్థుల దాహం తీర్చిన మాజీ సర్పంచ్...

* తాడ్మన్నూరు పాఠశాలలో బోరు బిగింపు...



అందోలు, ప్రజాస్ఫూర్తి: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నీటి సౌకర్యం లేక కొంత కాలంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ మాజీ సర్పంచ్ సంగీత అనిల్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో విద్యార్థులు పడుతున్న ఇక్కట్లు చూసి పాఠశాల ఆవరణలో బోర్ వేయించి సోమవారం మోటార్ బిగించారు. దీంతో గత కొంతకాలంగా ఎదుర్కొంటున్న నీటి ఇబ్బందులు నేటితో తీరడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ మాజీ సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నవీన్, మాజీ ఎంపీటీసీ నందిని నర్సింలు, తాజోద్దీన్, డప్పు మొగులయ్య, పెంటయ్య, ఖాజా, బంటు యాదయ్య, మల్లేశం, రవి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పాల్వంచ నారాయణ పాఠశాలలో విద్యార్థి క్యాబినెట్ ప్రమాణస్వీకారం

* పాల్గొన్న పాల్వంచ డి.ఎస్.పి సతీష్ కుమార్




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ నెహ్రూనగర్ నారాయణ పాఠశాలలో సోమవారం 2025-26 విద్యాసంవత్సరానికి ఎన్నికైన విద్యార్థి క్యాబినెట్ ప్రమాణస్వీకారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డి.ఎస్.పి సతీష్ కుమార్ విద్యార్థి నాయకుల చేత ప్రమాణం చేయించారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన వేడుకలో హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్‌లు, జూనియర్ హెడ్‌లు, హౌస్ కెప్టెన్లు, క్లబ్ కెప్టెన్లు బాధ్యతలు స్వీకరించి బ్యాడ్జీలు, కండువాలు ధరించారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి సతీష్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థి నాయకులు నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండి, ఉన్నత విలువలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ప్రదర్శించిన గణపతి నృత్యం, కూచిపూడి ఆకట్టుకోగా, యాంకర్ నరేష్ వినోదాత్మకంగా కార్యక్రమాన్ని నడిపించారు. ప్రిన్సిపాల్ పూరేటి నరసింహారావు, ఏజిఎం రాంకీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఇల్లందు పట్టణంలో ప్రజల సమస్యలను పరిష్కరించాలి

* మంత్రి పొంగిలేటి కి వినతి పత్రం అందజేసిన మాజీ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మడత వెంకట్ గౌడ్



ప్రజాస్ఫూర్తి ఇల్లందు : మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటనలో భాగంగా సోమవారం ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య నివాసంలో ఏర్పాటు చేసినటువంటి విందులో పాల్గొన్న మంత్రి పొంగిలేటి ని ఇల్లందు మాజీ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మడత వెంకట్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం ఇల్లందు పట్టణానికి అవసరమైనటువంటి జీ వో నెంబర్ 24 , ఇల్లందు మున్సిపాలిటీకి క్రీడా ప్రాంగణం , దసరా ఉత్సవాల కొరకై ఫారెస్ట్ గ్రౌండ్ అప్పగించుట అనుమతి కొరకు , ఓపెన్ కాస్ట్ మైనింగ్ స్థలం ఇల్లందు మున్సిపాలిటీ కేటాయింపుకై మంత్రి కి వినతి పత్రం అందజేశారు. వెంటనే స్పందించిన మంత్రి కలెక్టర్ కి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అతి త్వరలోనే ఇల్లందు పట్టణ ప్రజలకు లాభదాయకమైన సదుపాయాలు అందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా ఇల్లందు మాజీ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మడత వెంకట్ గౌడ్ వారితో పాటు ఏక్తా హౌస్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వాసవి మెటర్నిటీ హాస్పిటల్ ను ప్రారంభించిన చౌటుప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు

* **నాణ్యమైన, అధునాతన వైద్యం అందించడమే లక్ష్యం**
- **డాక్టర్ సూరపల్లి ఉమా మహేశ్వరి దేవి (ఎంఎస్ ఓబిజి)**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఈ ప్రాంత ప్రజలకు అత్యంత నాణ్యమైన ఆధునిక చికిత్స అందించడమే లక్ష్యంగా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని విద్యానగర్ కాలనీ హెచ్ పి గ్యాస్ లైన్ లో నూతన భవనంలో ఏర్పాటు చేసిన వాసవి మెటర్నిటీ హాస్పిటల్ ను మాజీ చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెన్ రెడ్డి రాజు మాట్లాడుతూ వాసవి మెటర్నిటీ ఆసుపత్రి ప్రజలకు ఆరోగ్యాన్ని అందిస్తూ ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలతో ప్రజలకు సేవలు అందించేందుకు ముందుకొచ్చిన డాక్టర్ ఉమా మహేశ్వరి దేవిని అభినందించారు. డాక్టర్ ఉమా మహేశ్వరి దేవి మాట్లాడుతూ అదునాతన సాంకేతికతతో, ఆధునిక యంత్ర పరికరాలతో మహిళలకు అన్ని విధాలుగా అత్యంత నాణ్యమైన వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని గాంధీ పార్క్ 5సంవత్సరముల నుంచి గైనకాలజిస్ట్ ప్రసూతి వైద్యురాలిగా మహిళలకు సేవలను అందిస్తున్నానన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని విద్యానగర్ కాలనీ హెచ్ పి గ్యాస్ లైన్ లో నూతన భవనంలో ఆసుపత్రిని ప్రారంభించడం జరిగిందన్నారు. సమగ్ర మహిళల ఆరోగ్య సేవలకు గాను సాధారణ తనిఖీల నుంచి ప్రత్యేక చికిత్సల వరకు విస్తృత శ్రేణి స్త్రీ జననేంద్రియ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసుపత్రిలోని అత్యాధునిక సౌకర్యాలు, నిపుణులైన వైద్య సిబ్బంది ప్రతి రోగికి ఆమె అవసరాలకు తగిన వ్యక్తిగతీకరించిన సంరక్షణ లభించేలా ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రజలకు ఎలాంటి సౌకర్యం లేకుండా ఆసుపత్రి బయటనే పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. చౌటుప్పల్లో వైద్య సేవలు ప్రారంభించిన నాటి నుంచే మండలంలోని వివిధ గ్రామాలలో ఉచిత వైద్య సేవలు అందించడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేశామని గుర్తు చేశారు. ఈ మధ్యకాలంలో వాసవి ఫౌండేషన్ ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో ఫౌండేషన్ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అధ్యక్షులు బొబ్బిళ్ళ మురళి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవుల యేసు యాదవ్, చింతల సాయిలు, వైద్యులు పాండురంగం, శ్రీనివాస ప్రసాద్, వీరన్న, వెంకటేశం పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రముఖులను డాక్టర్ ఉమామహేశ్వరి దేవి బాలసుబ్రమణ్యం దంపతులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : తొలి బహుజన సామ్రాట్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా కూకట్ పల్లి కోర్టు బార్ హాల్ లో సీనియర్ న్యాయవాది పరమేష్ గౌడ్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తూ 18వ శతాబ్దంలోనే ఒక బహుజన బిడ్డ నాటి నిరంకుశ పాల కుల పై తిరుగుబాటు చేసి గోల్కొండ సామ్రాజ్యంపై విజయ బావుట ఎగరవేసిన ఘనత సర్దార్ సర్వాయి పాపన్నకి దక్కుతుందని కొనియాడారు. పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో నేటి యువత తమ హక్కుల కోసం, సమాజంలో జరుగుతున్న అన్యాయంపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి కోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, అఖిలేష్, బార్ అసోసియేషన్ సభ్యులు అర్చన గౌడ్, మాజీ ప్రధాన కార్యదర్శి తాండ్ర రమేష్ గౌడ్ , నిమ్మల శ్రీనివాస్, రక్తపు శేఖర్ గౌడ్ , కేశవరావు, యాదయ్య, శ్రీనివాస్ సింగ్ లతోపాటు సీనియర్ ,జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ ను కలిసిన వెంకటేశ్వర్ నగర్ 35 బ్లాక్ వెల్ఫేర్ అసోసియేషన్



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ లోని వెంకటేశ్వర్ నగర్ 35 బ్లాక్ వెల్ఫేర్ అసోసియేషన్ కి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం సభ్యులు వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు ని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కార్పొరేటర్ రోజా దేవి రంగారావు సలహాదారులైనటువంటి రాములు సాగర్, రామ్ సాగర్, నర్సింగ్ రావు, సత్యనారాయణ, అధ్యక్షులు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి అనిల్, సొసైటీ మెంబర్లు అందరినీ సన్మానం చేసి మీ వెల్ఫేర్ పరిధిలో ఉన్న ప్రజలందరికి మీరు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకొని మాకు తెలిపినచో మేము వీలైనంత తొందరగా సమస్యలను పరిష్కారం చేసే విధంగా చేస్తామని అన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి సందర్భంగా సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీ, తెలుగు తల్లి నగర్ లో కౌండిన్య మహాముని గౌడ సంఘం ప్రెసిడెంట్ ఎం.ఎస్.ఆర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మేడ్చల్ ఫిషరీస్ కమిటీ చైర్మన్ మన్నే రాజు, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణలు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సుభాష్ నగర్ డివిజన్ గౌడ సంఘం అధ్యక్షులు సతీష్ గౌడ్, దూలపల్లి పీఏసీ డైరెక్టర్ సత్యనారాయణ యాదవ్ , నాయకులు తారా సింగ్ నాయక్, శ్రీనివాస్ గౌడ్, కరాటే శంకర్, కరాటే శీను, నాగేష్ రెడ్డి, రాధాకృష్ణ, శ్యామ్, బద్రి, శివ, ప్రసాద్ రాజు, లక్ష్మణ్, నారాయణ , రాపాక వెంకటేశ్వరరావు, బొంతు వెంకటేశ్వరరావు, నిరంజన్ , మేస్త్రి నరసింహ , కౌండిన్య మహాముని గౌడ సంఘం అధ్యక్షుడు ఎంఎస్. గౌడ్ , విత్తనాల వెంకటేశ్వరరావు గౌడ్, పవన్ గౌడ్, సుబ్బారావు గౌడ్, రమణ గౌడ్, ఏడుకొండల గౌడ్, నాగయ్య గౌడ్, సాయి కుమార్ గౌడ్ , దుర్గారావు గౌడ్, రాజశేఖర్ గౌడ్ పలువురు నాయకులు తదితరులు బస్తి పెద్దలు పాల్గొన్నారు.

## గణేష్ మండపాల నిర్వాహకులు నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

* **గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మండపాల ఏర్పాటు కొరకు ఆన్లైన్లో నమోదు చేసుకోవాలి**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో గణేష్ మండపాల నిర్వహణకు ఉత్సవ కమిటీ సభ్యులు తెలంగాణ పోలీసు శాఖ వారు రూపొందించిన పోర్టల్ https://policeportal.tspolice.gov.in/ నందు ధరఖాస్తు చేసుకోవాలని, ఆన్లైన్ ఇన్ఫర్మేషన్ అనేది కేవలం మండపాల నిర్వహణ, మండపానికి సంబంధించిన సమాచారం కొరకు మాత్రమేనని,ఈ సమాచారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత , పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీసులకు సులభంగా ఉంటుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు.పోలీసు శాఖ ఆన్లైన్ ద్వారానే అనుమతి మంజూరు చేయడం జరుగుతుందని, ఆ తరువాతనే వినాయక మండపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలను ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

* **గణేష్ ఉత్సవ కమిటీలు పాటించవలసిన నియమ నిబంధనలు:**

గణేష్ మండపాల పూర్తి బాధ్యత మండపాల నిర్వాహకులదే. ప్రతీ మండపం వద్ద తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలి. గణేష్ మండపాలు ప్రజా రవాణాకు,ఎమర్జెన్సీ వాహనాలకు, ట్రాఫిక్ నకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలి.మండపం ఏర్పాటు చేసే స్థలం కోసం యజమాని మరియు సంబంధిత శాఖల వారితో అనుమతులు తీసుకోవాలి. మండపాల కమిటీ వివరాలు,బాధ్యత వహించే వారి వివరాలు,ఫోన్ నెంబర్లను మండపంలో ఏర్పాటు చేయాలి. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలి. మండపాల్లో శోభాయాత్ర సమయాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలను ఏర్పాటు చేయరాదు. మండపం వద్ద 24గంటలు ఒక వాలంటీర్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకొని క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు వాలంటీర్లను నియమించుకోవాలి. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా దగ్గరలో ఇసుక , నీటిని అందుబాటులో ఉంచుకోవాలి. గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం, అసభ్యకరమైన నృత్యాలు, అన్యమతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు పాటలు పూర్తిగా నిషేధం. మండపం వద్ద పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలి,విధిగా పోలీసు అధికారుల తనిఖీకి వచ్చినప్పుడు అందులో వ్రాసి సంతకం చేస్తారు. అనుమానాస్పదమైన బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు, వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి. సామాజిక మాధ్యమాలలో వచ్చే ఎలాంటి వదంతులను నమ్మకూడదని,ఎవరికైనా ఎలాంటి సందేహాలు ఉంటే వెంటనే సంబంధిత పోలీసు అధికారులను లేదా డయల్ 100 నంబర్ను సంప్రదించాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సూచించారు.

## మంచినీళ్ల బావి చుట్టూ ప్రీ కాస్ట్ వాల్ నిర్మాణం






ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న పెద్ద మంచినీళ్ల బావి విద్యార్థులకు ప్రమాదకరంగా ఉంది. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా కలెక్టర్ తక్షణం స్పందించి, వెంటనే బావి చుట్టూ గోడ నిర్మించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామ పంచాయతీ నిధులు రూ.35వేలతో ప్రీ కాస్ట్ వాల్ నిర్మాణం చేపట్టారు. విద్యార్థులకు ప్రమాదకరంగా మారిన మంచినీళ్ల బావి చుట్టూ రక్షణ వలయంగా గోడ నిర్మాణం చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్కు, నిర్మాణం పనులు చేయించిన ఎంపిడిఓ, ఎంపిఓ, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఎంఈఓ, మాజీ ఎంపిటిసి గుండ్లె శ్రీనివాస్ గౌడ్, భానులకు పాఠశాల తరుపున హెచ్ఎం ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ్, ఉపాధ్యాయులు బాదవేన అంజాగౌడ్లు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

## భారీ వర్షా ల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

* **సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి సూచనలు**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో ముస్తాబాద్ మండల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి పేర్కొన్నారు. భారీ వర్షాల క్రమంలో విద్యుత్ సంబంధిత పలు విషయాలపై ప్రజలకు, రైతులకు ఒక ప్రకటనలో సూచనలు చేశారు. భారీ గాలులకు, వర్షాలకు విద్యుత్ తీగలు, స్తంభాలు విరిగి పడే అవకాశాలుంటాయని, కొన్ని సందర్భాల్లో చెట్లు విరిగి విద్యుత్ తీగల మీద పడటం, లేక విద్యుత్ స్తంభాల మీద పడటం కారణంగా విద్యుత్ స్తంభాలు విరిగి కింద పడే అవకాశాలుంటాయని తెలిపారు. ఈ క్రమంలో అటుగా వెళ్లే వారు ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రైతులు పొలాలకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తెగిన విద్యుత్ తీగలు గానీ, విద్యుత్ స్తంభాలు గానీ తారస పడితే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో ట్రాన్స్ఫార్మర్లు, కరెంట్ ఫోల్స్ తాకటం చేయవద్దని, రైతులు వారికి సంబంధించిన పశువులను కూడా ట్రాన్స్ఫార్మర్లు, కరెంట్ ఫోల్స్ సమీపానికి వెళ్లకుండా చూసుకోవాలని సూచించారు. ఎక్కడ విద్యుత్ తీగలు తెగి, విద్యుత్ స్థంబాలు విరిగి కనిపించిన వెంటనే విద్యుత్ అధికారులు సమాచారం ఇవ్వాలన్నారు. ముస్తాబాద్ మండల పరిధిలో ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా విద్యుత్, పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, ఆర్అండ్బి, వైద్య శాఖ అధికారులందరూ సమన్వయం చేసుకుంటూ పని చేయడమే కాకుండా ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఉదృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు వెళ్ళరాదని సూచించారు. చెట్ల కింద, పాడైన భవనాలు కింద, శిధిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండరాదని అన్నారు. భారీ వర్షాలు కురుస్తున్నందున సాధారణ పరిస్థితి వచ్చే వరకు ప్రజలెవరూ కూడా అనవసరంగా భయటకు వెళ్ల వద్దని సూచించారు.

## ఈసిఐఎల్ లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలు



ప్రజాస్ఫూర్తి, కాప్రా : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి సందర్భంగా ఈసిఐఎల్ చౌరస్తా లో గౌడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మేడ్చల్ మల్కాజిగిరి ఆధ్వర్యంలో ఘనంగా ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ జేఏసి రాష్ట్ర కో కన్వీనర్ ముత్యం ముఖేష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నేడు పాపన్న జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్ వద్ద పాపన్న విగ్రహ ప్రతిష్ఠాపనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమి పూజ చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు తాళ్ళ ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ఎక్స్ గ్రేషియా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గౌడ హాస్టల్ మేనేజింగ్ కమిటీ సభ్యులు పండాల శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ గౌడ వృత్తిదారులు రోజుకు ఒకరు ఇద్దరు చెట్టు పై నుండి పడి మరణిస్తున్నారని, ప్రభుత్వం వృత్తిదారులకు సేఫ్టీ మోకులు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి బుడంపల్లి నిరంత్ గౌడ్, అఖిల భారత గౌడ సంఘం కోళ్ళ ఈశ్వర్ ప్రసాద్ గౌడ్, ఈసిఐఎల్ రిటైర్డ్ జిఎం పి. శ్రీనివాస్ గౌడ్, సంకూరి శ్రీనివాస్ గౌడ్, దూడల సాంబమూర్తి గౌడ్, రుద్రగోని రామచందర్ గౌడ్, తాళ్ళ వెంకటేష్ గౌడ్, దేవనాధం, రాజు వంశరాజ్, లక్ష్మణ్ గౌడ్, దినేష్, కీసర ప్రేమ్ గౌడ్, బుడంపల్లి రఘుపతి గౌడ్, పండాల గణేష్ గౌడ్, పుట్ట సహదేవ్ గౌడ్, ఎరుకల రామచందర్ గౌడ్, బుడంపల్లి వెంకటేష్ గౌడ్, నూనెముంతల రంజిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## తన సర్వస్వాన్ని ధారబోసిన మహాయోధుడు సర్వాయి పాపన్న

* **మాజీ కార్పొరేటర్ జి.సురేష్ రెడ్డి**



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : పీడిత జనుల కోసం, బహుజనుల ఆత్మగౌరవం కోసం తన సర్వస్వాన్ని ధారబోసిన మహాయోధుడు సర్వాయి పాపన్న అని మాజీ కార్పొరేటర్ జి.సురేష్ రెడ్డి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో భాగంగా సోమవారం సూరారం కాలనీ తెలుగు తల్లి నగర్ లో గల పాపన్న విగ్రహానికి ఆయన పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరంకుశ పాలనకు ఎదురొడ్డి, అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన పాపన్న గౌడ్ తెలంగాణలో పుట్టడం మనందరికి గర్వకారణమన్నారు. సామాజిక, రాజకీయ సమానత కోసం కృషి చేసిన బహుజన వీరుడు సర్వాయి పాపన్న పోరాటస్ఫూర్తిని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతోనే గత కేసీఆర్ ప్రభుత్వం సర్దార్ సర్వాయి పాపన్న జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. సామాజిక విప్లవకారుడు సర్దార్ సర్వాయి పాపన్న గొప్పతనాన్ని స్మరించుకుంటూ.. అందరు అతని అడుగుజాడల్లో నడవాలని సూచించారు.ఈ కార్యక్రమం లో సర్వాయి పాపన్న గౌడ సంఘ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వర్గీయ జల్దా వెంకటేశం వర్ధంతి వేడుకలు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : గాంధీనగర్ పరిసర ప్రాంతాల వ్యవస్థాపకులు, నిరుపేదల పక్షపాతీ స్వర్గీయ జల్దా వెంకటేశం వర్ధంతి సందర్భంగా సోమవారం రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్లో గల ఆయన విగ్రహానికి గ్రామ పెద్దలు పాల్గొని పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ వెంకటేశం కృషి వల్ల ఇందిరా గాంధీనగర్, గుడెన్మెట్, గాంధీనగర్, గురుమూర్తి నగర్, రంగారెడ్డి నగర్, వెంకట్రామారెడ్డి నగర్ తదితర ప్రాంతాలలో వందలాది మందికి ఇంటి స్థలాలు అందయాన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ పెద్దలు జల్దా రాఘవులు, ఖాజామియా, ఎల్లయ్య, లక్ష్మి నాథ్, శ్రీనివాస్ గౌడ్, జలీల్, బిక్షపతి, పాషా భాయ్, సాయి కుమార్, కమలా బాయ్, మహిళలు, యువజన సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

*** పి ఆర్ టి యు టి ఎస్**

మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని పి ఆర్ టి యు టి ఎస్ కోరారు. సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబర్ ఒకటో తారీకు ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద తలపెట్టిన పి ఆర్ టి యు టి ఎస్ మహా ధర్నా గోడపత్రికను సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ముందర టీజీ ఈజేఏసీ చైర్మన్ రవి ప్రకాష్, సెక్రెటరీ జనరల్ వినోద్ , పి ఆర్ టి యు టి ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్ , ప్రధాన కార్యదర్శి ఆనంద్ రెడ్డి లు పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత అసెంబ్లీ




ఎన్నికల ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టి ప్రభుత్వం ఏర్పడగానే రద్దు చేస్తామని తెలిపారని ఆ మాట నిలబెట్టుకోవాలన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల పాటు పాలించి సిపిఎస్ రద్దు చేయలేక ఉద్యోగులను మోసం చేసిందని నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సిపిఎస్ ను రద్దు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్ విధానం 2004 సెప్టెంబర్ ఒకటవ తేదీ నుండి అమల్లోకి వచ్చిందని దానిని విద్రోహ దినంగా పాటిస్తూ దశాబ్ద కాలంగా ఉద్యమాలు చేస్తున్నామని వచ్చే సెప్టెంబర్ ఒకటవ తేదీ న ఇందిరా పార్కు వద్ద పిఆర్టియు టీఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నామని అందరూ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో నల్ల దుస్తులతో పాల్గొని నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. 30 ఏళ్లుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పదవి విరమణ పొందితే షేర్ మార్కెట్ల పై ఆధారపడిన అసంబద్ధమైన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఐదు సంవత్సరాలు ప్రజాప్రతినిధిగా కొనసాగితే పెన్షన్ హక్కు ఉన్నప్పుడు. 30 ఏళ్లు ప్రభుత్వానికి ప్రజలకు సేవ చేస్తే పెన్షన్ హక్కు లేకపోవడం విచారకరమన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఏకీకృత పెన్షన్ సిస్టమ్ అని యుపిఎస్ విధానాన్ని ప్రవేశపెట్టిందని రెండు కూడా లోపభూయిష్టంగా ఉన్నాయని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి తీరాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేంతవరకు ఉద్యమిస్తూనే ఉంటామని తెలిపారు. ప్రతి ఒక్కరు ఒకటవ తేదీ రోజు సెలవు పెట్టి మహాధర్నాలో నల్ల దుస్తులతో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు మరియు రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టేకులపల్లి మండలం లో అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ఇల్లందు నియోజకవర్గం పర్యటనలో భాగంగా టేకులపల్లి మండలం లో పలు గ్రామాలలో అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట రెవిన్యూ,గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ,ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య శ్రీకారం చుట్టారు. ఇల్లందు మండలం లో గల మామిడి గుండాల గ్రామ పంచాయితి మెడికుంట మసివాగు గ్రామాల మధ్య గల బ్రిడ్జ్ కు ప్రజలకు ఇచ్చిన వాగ్ధానం మేరకు శంకుస్థాపన చేసి, ఇల్లందు మున్సిపాలిటి పరిధిలో గల జే.కె. కాలని నందు మినిస్టేడియం నిర్మాణ పనులకు శ్రీ కారం చుట్టి, సుభాష్ నగర్ గ్రామ పంచాయితి కరెంట్ ఆఫీస్ నుండి లలితాపురం గ్రామం వరకు రోడ్డు విస్తరణ,సెంటర్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. వారి వెంట ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మండలం మాజీ వైస్ ఎంపిపి మండల రాము,మున్సిపాలిటి చైర్మెన్లు దమ్మాలపాటి వెంకటేశ్వర్లు,యదలపల్లి అనసూర్య,టౌన్,మండల అధ్యక్షులు దొడ్డా డానియల్,పులి సైదులు,నాయకులు పూనెం సురేందర్,కాకటి భార్గవ్,చెన్నూరి క్రిష్ణ,చెన్నూరి శ్రీను,కిన్నెర నర్సయ్య,సొసైటి అధ్యక్షులు మెట్ల క్రిష్ణ,మూతి క్రిష్ణ,ఎట్టి హరిక్రిష్ణ,అరెం కిరణ్,దండుగుల శీవ, మాడుగుల సాంబమూర్తి, గందె సదానందం,చిల్లా శ్రీను, బోళ్ళ సూర్యం, ఈసం లక్ష్మణ్, పాయం క్రిష్ణ ప్రసాద్, కునుసోత్ రాము, ఎస్కె. జానీ, యండి. జాఫర్, బానోత్ శారద, కల్తి పద్మ, పాయం స్వాతి, మోకాళ్ళ వెంకటమ్మ, పత్తి స్వప్న,గోచికోండ శ్రీదేవి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గోన్నారు.

## ఫ్రీ మెగా సర్జికల్ , మెడికల్ క్యాంపు మంచి స్పందన




కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : నగరంలోని రాజ్ భవన్ లో ఇండియన్ రెడక్రాస్ సొసైటీ అఫ్ హైదరాబాద్, డిజెబుల్డ్ ఫౌండేషన్ ట్రస్టు సంయుక్తంగా రాందేవ్ రావ్ హాస్పటల్ ఫ్రీ మెగా సర్జికల్ , మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపు కు ముఖ్య అతిధిగా రాష్ట్ర గవర్నర్ , ఐఆర్సీఎస్ తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ జిష్ణు దేవ్ వర్మ జి, స్పెషల్ అతిధిగా షెడ్యుల్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమం, మైనార్టీల సంక్షేమం వికలాంగుల సాధికారత అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు విచ్చేసి ప్రారంభించారు.ఈ క్యాంపు లో బీఎండి, బీఎంఈ, డీఎన్, డెంటల్ చెకప్, కంటి పరీక్షలు, ఫైబ్రో స్కాన్, జీఆర్బీఎస్, ఫీజియోథెరిపి,గైనాకాలజీస్టు, జనలర్ ఫిజీషియన్, ఆర్థోపిడిక్, ఈ విభాగలలో కన్సల్టెషన్, మందులు,టెస్టులు కలిపి 20 వేల రూపాయల విలువైనవి 3000 మందికి ఉచితంగా ఇవ్వడం జరిగింది.ఈ క్యాంపు నందు డాక్టర్ మని కుమార్, డాక్టర్. వినీష, డాక్టర్. ప్రిన్సీ, డాక్టర్. పవన్, డాక్టర్ ప్రసన్న, డాక్టర్ అఖిల,సీఈఒ డాక్టర్ యోబు, అడ్మిర్మేనేజర్స్ కల్పన, శ్రవణ్ కుమార్ రెడ్డీ, అశోక్ , ఇతర హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర నిధుల కోసం నివేదిక ఇస్తాం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్

హైదరాబాద్: రాష్ట్రంలోని సంక్షేమశాఖలకు రావాల్సిన నిధుల కోసం కేంద్రానికి సమర్పించేందుకు నివేదిక సిద్ధం చేయాలని సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధికారులను ఆదేశించారు. వారం రోజుల్లో దిల్లీకి ప్రతినిధి బృందంగా వెళ్లి కేంద్రానికి ఆ నివేదిక ఇస్తామని పేర్కొన్నారు. కేంద్రం నుంచి అందాల్సిన నిధులపై సోమవారం పలు సంక్షేమశాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కేంద్రం నుంచి విద్యార్థుల ఉపకారవేతనాల నిధులు రావాల్సి ఉందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఎస్టీ సంక్షేమశాఖకు దాదాపు రూ.450 కోట్లు, ఎస్సీ సంక్షేమశాఖకు రూ.900 కోట్లు రావాల్సి ఉందని చెప్పారు. ఎస్సీ సంక్షేమశాఖలో ప్రీమెట్రిక్ ఉపకారవేతనాలు, వేధింపుల నియంత్రణ చట్టం కింద బకాయిలు రావాల్సి ఉందన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులతో పాటు రాష్ట్రంలో అమలు చేసే వివిధ కార్యక్రమాలకు కేంద్రం నుంచి సహకారం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు.

## రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

*** యూఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఎం.చంద్రకాంత్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని యూఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఎం.చంద్రకాంత్ అన్నారు. నిరుద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ షాపూర్ నగర్ లో జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ప్రకాడ్లతో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలోగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 18 నెలలు గడుస్తున్న కూడా ఇంతవరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడం సిగ్గుచేటు, అదేవిధంగా ఎన్నికలలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను మైమర్చి అసలు నిరుద్యోగులను పట్టించుకునే పాపాన పోలేదు ఈ రేవంత్ రెడ్డి సర్కార్, అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఆ హామీల ఉసే ఎత్తడం లేదని ధ్వజమెత్తారు . ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చమని పోరాటాల చేస్తుంటే పోరాటాలు చేసే వారిని అణిచివేయడం సిగ్గుచేటని అన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి మంచి తీరు కాదని యావత్ విద్యార్థి లోకం తలుచుకుంటే నిలబెట్టిన ప్రభుత్వాన్ని కూడా దించేసే శక్తి విద్యార్థులకు ఉందని అన్నారు.రాష్ట్రంలో నడుస్తున్నది ప్రజా పాలన కాదని, పర్సంటేజీల పాలనా అని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర



ప్రభుత్వం తమ తీరును మార్చుకొని వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు హామీలను వెంటనే నెరవేర్చాలని లేనిపక్షంలో రాబోయే సర్పంచ్ జెడ్పిటిసి , ఎంపీటీసీ ఎన్నికలలో విద్యార్థులు ప్రభుత్వానికి బుద్ధి చెప్తారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా అన్నారు. యు ఎస్ ఎఫ్ ఐ యావత్ నిరుద్యోగుల పక్షాన అండగా నిలబడి రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచి మరి ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు సాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో యు ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా నాయకులు ఖుషి,సాయి, సంతు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీశ్రీ శ్రీ సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) :బహుజన చక్రవర్తి శ్రీ శ్రీ శ్రీ సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 375 వ జయంతి సందర్భంగా చింతల్ డివిజన్, భగత్ సింగ్ నగర్ లో భగత్ సింగ్ నగర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీశ్రీ శ్రీ సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిలుగా భగత్ సింగ్ నగర్ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బి సత్యం , భగత్ సింగ్ నగర్ బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సాంబయ్య , భగత్ సింగ్ నగర్ బీ ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు సామ్రాట్ , అంబేద్కర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెల్లా వెంకటేష్ లు పాల్గొని పాపన్న గౌడ్ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ తొలిరాజు, బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు, దొరల అరాచకాలను, మొగులాయి దౌర్జన్యలను ఎదురించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడికి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి ప్రతీక పాపన్న గౌడ్ మహారాజ్ అని గుర్తుచేశారు. రాజకీయ, సామాజిక సమానత్వం, కుల, మతాల వివక్ష లేకుండా సమ సమాజ ప్రజాస్వామిక స్ఫూర్తి తో ఆనాటి కాలంలోనే పోరాడిన యోధుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ నగర్ గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు బబ్బూరి బిక్షపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి పచ్చిమట్ల నరేందర్ గౌడ్, సలహాదారులు బాల్నే రమేష్ గౌడ్, ఉపాధ్యక్షులు బీసు వెంకటేశం గౌడ్, బత్తిని కుమార్ గౌడ్, కోశాధికారి బత్తిని శ్రీధర్ గౌడ్, కార్యదర్శి మడ్డి వెంకటేశ్వర్లు గౌడ్, ఆర్గనైజర్లు పూర్ణచందర్ గౌడ్, బత్తిని కిషన్ గౌడ్, గంటే వెంకటేష్ గౌడ్, రవి గౌడ్, శేఖర్ గౌడ్, గంటే నరేందర్ గౌడ్, నునమంతుల పరశురాములు, ప్రేమ్ కుమార్ యాదవ్, ఎల్ఐసి రాజు, సత్తిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కుమార్, యాదగిరి రెడ్డి, లింగం గౌడ్, రంగోలా లక్ష్మణ్ గౌడ్, తదితరులు హాజరై పూలమాలవేసి నివాళులర్పించారు

## 'సరోగసీ'పై ప్రత్యేక పోర్టల్

*** రూపొందిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ**

హైదరాబాద్: రాష్ట్రంలో అక్రమ సరోగసీ కేసులు వెలుగుచూస్తున్న క్రమంలో.. ఈ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టేందుకు వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక పోర్టల్‌ను రూపొందిస్తోంది. ఇకపై సరోగసీ కోసం ఎవరు నమోదు చేసుకోవాలన్నా ఆన్‌లైన్‌లోనే పక్కాగా వివరాలన్నీ పొందుపరిచేవిధంగా ఈ పోర్టల్‌ను ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనరేట్ తయారుచేస్తోంది. ఇంతవరకు సరోగసీ నమోదు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నా.. జిల్లా కమిటీకి, రాష్ట్ర కమిటీకి, న్యాయస్థానానికి విడివిడిగా దరఖాస్తు చేసుకునే విధానం ఉంది. ఇటీవల 'సృష్టి'తోపాటు పలు అక్రమ సరోగసీ కేంద్రాల దందా రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నేపథ్యంలో వీటిని సాంకేతికతతో కట్టడి చేయాలని వైద్య ఆరోగ్యశాఖ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రత్యేక పోర్టల్‌ను రూపొందిస్తోంది. సరోగసీ విధానం ద్వారా సంతానం పొందాలనుకున్నవారు ఈ పోర్టల్‌లో తమ పూర్తివివరాలను నమోదు చేసి ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో అనుమతి పొందాకే ముందుకు వెళ్లాల్సి ఉంటుందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

**టాస్క్‌ఫోర్స్ తనిఖీలు..**

సరోగసీ కేంద్రాల్లో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాల తనిఖీలు ఇటీవల పూర్తయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 376 కేంద్రాల్లో తనిఖీలను నిర్వహించగా అధికారులు అనేక లోపాలను గుర్తించారు. పలుచోట్ల సెంటర్ ఏర్పాటు కోసం అనుమతి తీసుకున్నది ఒకరైతే మరొకరు బాధ్యతలు చూసుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలను అనుమతి లేకుండా పెట్టడం.. కేంద్రాలకు వచ్చేవారి వివరాలను అరకొరగా నమోదు చేయడం.. ఎంబ్రియాలజిస్టులు లేకుండానే సెంటర్ల నిర్వహణ.. ఇలా అనేక విధాలుగా నిబంధనలను అతిక్రమిస్తున్నట్లు గుర్తించారు. ఇలాంటి కేంద్రాలకు అధికారులు షోకాజ్ నోటీసులు ఇవ్వనున్నారు. గుర్తించిన లోపాలపై ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ ఈ వారంలో వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శికి నివేదికను అందజేయనున్నట్లు సమాచారం.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ వీరత్వానికి, పరాక్రమానికి ప్రతీక

*** ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తెలంగాణ వీరత్వానికి, పరాక్రమానికి ప్రతీక అని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఎన్టీఆర్ నగర్ కమాన్ ఎదురుగా ఉన్న పాపన్న గౌడ్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సబ్బండ వర్గాల ఆత్మగౌరవానికి స్ఫూర్తిగా నిలిచిన సర్వాయి పాపన్న వీరగాథను పాపన్న జయంతి సందర్భంగా స్మరించుకున్నారు. ఆనాటి సమాజంలో నెలకొన్న నిరంకుశ రాజరిక పోకడలకు వ్యతిరేకంగా సబ్బండ వర్గాలను ఏకం చేసి, పాపన్న పోరాడిన తీరు గొప్పదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, పాండుగౌడ్, శివరాజ్ గౌడ్, పాండుగౌడ్, ఆంజనేయ ప్రసాద్ గౌడ్, రాందాస్ గౌడ్, పోశెట్టిగౌడ్, బ్రహ్మానంద గౌడ్, రామస్వామి, షౌకత్ అలీ మున్నా, మల్లేష్, గుడ్ల శ్రీనివాస్, శ్రీశైలం గౌడ్, సందీప్ గౌడ్, రవీందర్, నాగరాజు, ఖలీమ్, గౌస్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్.ఎ.డబ్ల్యూ యూనియన్ అధ్యక్షుడు వేంకటాద్రి కి ఘన సన్మానం

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : బాలానగర్ హెచ్. ఎ.ల్ కార్మికులకు



సంబందించిన ఇన్సెంటివ్ మీటింగ్ కు అల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటీ హైదరాబాద్ డివిజన్ కన్వీనర్ కే. వేంకటాద్రి బెంగళూరు కార్పొరేట్ ఆఫీస్ లో జరిగిన సమావేశం లో పాల్గొని గత 12 సంవత్సరాల నుండి పెండింగ్ లో ఉన్న మంత్లీ ఇన్సెంటివ్, క్యూ పి పి, అన్యువల్ ఇన్సెంటివ్ తదితర అంశాల పై యాజమాన్యం తో కులాంకుశంగా చర్చించి కార్మికులకు అనుకూలంగా యాజమాన్యాన్ని ఒప్పించి కార్మికులకు మేలు చేసినందుకు సోమవారం బాలానగర్ హెచ్ఎల్ పరిశ్రమలో ఉన్న యూనియన్ ఆఫీస్ లో జరిగిన సమావేశం లో వారికి శాలువాతో సన్మానించి పూల మాల వేసి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్స్ గణేష్, కర్కనాగరాజు, అన్వార్, వైసెప్రెసిడెంట్స్ కూతడి కృష్ణా, ప్రభాకర్ రెడ్డి,అశోక్, అనిల్ రెడ్డి,నాగరాజు, డిప్యూటీ ప్రధానకార్యదర్శి రాంచందర్, బాబీ, జోగారావు, పురుషోత్తం, శ్రీధర్, వెంకటపతి, పోలేపల్లి శ్రీకాంత్, భాగ్య, మంజుల, నీలవేణి, భారతి,ప్రవీణ్,అబ్దుస్ షకూర్, సత్యనారాయణ,వెంకటేష్, నాగార్జున, శ్రీధర్, చక్రవర్తి, నవీన్, ముజీబ్, శ్రీనివాస్, రామారావు, సింహాచలం,రవి, సుధీర్,యశ్వంత్,సురేష్, రమేష్, రమణ, కృష్ణబాబు, సూర్య ప్రకాష్, వేణుగోపాల్ రెడ్డి, సుందర్ రాజు , షాబుద్దీన్,అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## తండా యువకుడి కవిత సీబీఎస్ఈ పాఠమైంది..

నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి తండాకు చెందిన రమేశ్ కార్తిక్‌నాయక్ రాసిన కవిత పాఠమైంది. ఆయన రచించిన 'చక్‌మక్' (చెకుముకి రాయి) ఆంగ్ల కవితా సంపుటిలోని 'ది రోస్ ల్యాండ్' కవితను సీబీఎస్ఈ బోర్డు ఈ ఏడాది 8వ తరగతి ఆంగ్ల సిలబస్‌లో ఆరో పాఠంగా చేరుస్తూ.. సోమవారం సమాచారం అందజేసింది. 'ది రోజ్ ల్యాండ్' కవిత.. బంజారా తెగకు చెందిన తల్లీకొడుకుల జీవన ప్రయాణ ఇతివృత్తంతో సాగుతుంది. తల్లి చెప్పినా వినకుండా ఓరోజు వారు పనిచేసే తోటకు బాలుడు బయల్దేరి వెళ్తాడు. గులాబీ తోట నుంచి సాగే అతడి ప్రయాణం, ప్రకృతితో ముడిపడిన గత, వర్తమాన అనుభూతుల్ని పంచుతూ సాగుతుంది. బాల్యంలో చుట్టుముట్టే భయాలు, ఊహా లోకపు మాయలు దాటుకుని వెళ్తుంటుంది. జింకల పాదముద్రలు, నెమలి ఈకలు, మామిడి చెట్టు ఫలాలు, దేవతగా పూజలందుకునే రాయి వంటి ఘట్టాలు బంజారా తెగ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి.

# రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ నిర్మాణాలు

* కూకట్ పల్లి లో జోరుగా అక్రమ నిర్మాణాలు

**(ప్రజాస్ఫూర్తి, కూకట్ పల్లి)** మూసాపేట్ సర్కిల్ పరిధిలోని కెపిహెచ్ బి కాలనీ, బాలాజీ నగర్, మూసాపేట్, అల్లాపూర్, ఫతేనగర్ డివిజన్ లలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు... తద్వారా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది... టౌన్ ప్లానింగ్ అధికారుల మద్దతుతోనే జోరుగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.. ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమ నిర్మాణాలతో టౌన్ ప్లానింగ్ అధికారులు జేబులు నింపుకుంటున్నారని.. అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాల్సిన అధికారులే చూసీ చూడనట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**అక్రమ నిర్మాణాలకు అడ్డు లేదు**

మూసాపేట్ సర్కిల్ పరిధిలోని కెపిహెచ్బి, బాలాజీ నగర్, మూసాపేట్, అల్లాపూర్, ఫతేనగర్ డివిజన్లో అక్రమ నిర్మాణాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవినీతిపై పలు ఆరోపణలు వినిపిస్తున్నా యి. జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు తీసుకున్న నిర్మాణదారులు నిబంధనలు పాటించడం లేదు. భవనానికి నాలుగు పక్కల సెట్ బ్యాక్ వదలాల్సి ఉన్నా, ఏ నిర్మాణదారుడు సెట్ బ్యాక్ వదలడం లేదు. అనుమతులకు మించి బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు.. టౌన్ ప్లానింగ్ అధికారులు భవన నిర్మాణాలను పరిశీలించాల్సి ఉండగా, మామూళ్లు దండుకుంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. అనుమతులు ఇచ్చే ముందు ఒకసారి పరిశీలించి



తిరిగి మళ్లీ పరిశీలించకపోవడం, మళ్లీ తిరిగి చూడకపోవడం, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోకపోవ డం అక్రమ నిర్మాణాలను కూల్చివేయక పోవడం వంటివి చూస్తుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు ఏ మేరకు పని చేస్తున్నారో.? అన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు నష్టం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై ప్రజలు ఫిర్యాదు చేసినప్పటికీ నామమాత్రంగా నోటీసులు జారీ చేసి చేతికి అందినంత దండుకుంటున్నారని స్థానికులు సామాజికవేత్తలు ఆరోపిస్తున్నారు. కెపిహెచ్బి డివిజన్ లో వసంత నగర్, గోపాల్ రావు నగర్, భగత్ సింగ్ నగర్, 5,6,7,9 ఫేస్ , ధర్మారెడ్డి కాలనీ, ఎస్ఎస్ కాలనీ, ఎన్నారై కాలనీ, సిబిసిఐడి కాలనీ, 4,5 రోడ్, బాలాజీ నగర్ డివిజన్ పరిధిలోని 1,2,3,4,15 ఫేస్, హబీబ్ నగర్, అంజయ్య నగర్, బాలాజీ నగర్, వివేక్ నగర్ లో బహుళ అంతస్తుల నిర్మాణా లు నిబంధనలకు విరుద్ధంగా జోరుగా కొనసాగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో స్థానిక ప్రజలు అక్రమదారులను నిబంధనలకు విరుద్ధంగా నిర్మించడం ఏమిటని ప్రశ్నిస్తే తాము అధికారుల అనుమతితోనే నిర్మిస్తున్నామని, అవస రమైతే ఫిర్యాదు చేసుకోండని దురుసుగా సమాధానమిస్తున్నారని తెలుపుతున్నారు. రు. ఇంత యదేచ్ఛగా అక్రమనిర్మాణాలు కొనసాగడంపై అధికారుల పనితీరు ఈ అక్రమ నిర్మాణాలే నిదర్శనమని తెలుస్తోంది. కింది స్థాయి అధికారులు అక్రమ నిర్మాణదారుల వద్ద చేయి చాపడంతోనే ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని, ఇప్పటికైనాపై అధికారులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టకుండా అక్రమ నిర్మాణదారులపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

## తెలంగాణలో సంస్కరణలు.. దేశానికి దశాదిశ నిర్దేశించేలా ఉన్నాయి: భట్టి విక్రమార్క

హైదరాబాద్ : తెలంగాణలో చేపడుతున్న సంస్కరణలు, నిర్ణయాలు.. దేశానికి దశాదిశ నిర్దేశించే స్థాయిలో ఉన్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ట్యాంక్‌బండ్ సమీపంలో పాపన్నగౌడ్ విగ్రహానికి శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశచరిత్రలో ఎక్కడా లేని విధంగా కులగణన చేపట్టామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై చట్టం చేశామని తెలిపారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు దేశంలోనూ అమలుకు దారి తీశాయని వివరించారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలను ప్రతి గ్రామం, ఇంటికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రభుత్వం తెలంగాణలో విప్లవాత్మక మార్పు



తీసుకువస్తోందని వివరించారు. కాంగ్రెస్ మూల సిద్ధాంతం సామాజిక న్యాయమని తెలిపారు.

## కొత్త ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వండి : నిర్మలా సీతారామన్ కు మంత్రి లోకేశ విజ్ఞప్తి

* కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో మంత్రి లోకేశ్ భేటీ
* మంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన లోకేశ్
* ఏపీకి ఆర్థిక సాయంపై కేంద్రానికి కృతజ్ఞతలు
* రాష్ట్రంలో అభివృద్ధి పనుల పురోగతిపై వివరణ

ఆంధ్రప్రదేశ్, ఆగష్టు 18 (భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో సోమవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి కేంద్రం అందిస్తున్న ఆర్థిక సహకారానికి లోకేశ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని, ప్రభుత్వ ప్రాధాన్యతలను నిర్మలా సీతారామన్‌కు వివరించారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తలపెట్టిన కొత్త ప్రాజెక్టులకు సంపూర్ణ సహకారం అందించాలని ఈ సందర్భంగా లోకేశ్ ఆమెను కోరారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. నారా లోకేశ్ ఇవాళ ఢిల్లీ పర్యటనలో ఫుల్ బిజీగా ఉన్నారు. ఇప్పటికే ఆయన కేంద్రమంత్రులు జై శంకర్, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీలను కలిసి రాష్ట్ర ప్రాజెక్టులపై కీలక ప్రతిపాదనలు చేశారు.

## భారీవర్షాలు బీభత్సం సృష్టించే అవకాశం.. అప్రమత్తంగా ఉండాలి



హైదరాబాద్ : భారీ వర్షసూచనతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సీతక్క ఆదేశించారు. నేడు ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో అతి భారీవర్ష సూచన ఉందని చెప్పారు. మంగపేట, ఏటూరునాగారం, తాడ్వాయిలో భారీవర్షాలు కురుస్తున్నాయన్నారు.. సహాయక చర్యల కోసం ఫ్లడ్ మేనేజ్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భారీ వర్షాలు బీభత్సాన్ని సృష్టించే అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు.

## రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు... భారత్‌కు అమెరికా తీవ్ర హెచ్చరిక

* రష్యా, చైనాలతో భారత్ సన్నిహితంగా ఉంటోందన్న వైట్‌హౌస్ సలహాదారు
* వ్యూహాత్మక భాగస్వామిగా ఉండాలంటే అందుకు తగ్గట్టు నడుచుకోవాలని సూచన
* అమెరికా ఆరోపణలను తిప్పికొట్టిన భారత విదేశాంగ శాఖ
* అమెరికా, ఐరోపా దేశాలూ రష్యాతో వ్యాపారం చేస్తున్నాయని కౌంటర్

ఢిల్లీ : రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్న విషయంలో భారత్‌పై అమెరికా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ చర్యలను తక్షణమే నిలిపివేయాలని, లేనిపక్షంలో అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్య హోదాపై ప్రభావం పడుతుందని వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో హెచ్చరించారు. అయితే, ఈ ఆరోపణలను భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. తమను అన్యాయంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని, అమెరికా సహా ఐరోపా దేశాలు కూడా రష్యాతో ఇప్పటికీ వాణిజ్యం చేస్తున్నాయని గుర్తు చేసింది. 'ఫైనాన్షియల్ టైమ్స్' పత్రికలో రాసిన ఒక వ్యాసంలో పీటర్ నవారో ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి భారత్ చమురు కొనడం వల్ల, పరోక్షంగా ఉక్రెయిన్‌పై మాస్కో చేస్తున్న యుద్ధానికి నిధులు సమకూరుస్తున్నట్టే అవుతుందని ఆయన ఆరోపించారు. "భారత్ ఒకే సమయంలో రష్యా, చైనాలతో సన్నిహితంగా మెలుగుతోంది. అమెరికాకు వ్యూహాత్మక భాగస్వామిగా కొనసాగాలనుకుంటే, అందుకు తగినట్టుగా భారత్ ప్రవర్తించడం మొదలుపెట్టాలి" అని ఆయన స్పష్టం చేశారు. నవారో చేసిన వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందిస్తూ, తమ దేశ ప్రయోజనాలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొంది. కేవలం భారత్‌ను మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం సరికాదని, అమెరికా, ఐరోపా సమాఖ్య దేశాలు కూడా రష్యాతో వాణిజ్య సంబంధాలను కొనసాగిస్తున్న విషయాన్ని ప్రస్తావించింది. ఈ పరిణామంతో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. భారత్ అమెరికా మధ్య 25-29 తేదీల్లో జరగాల్సిన వాణిజ్య చర్చలు రద్దయిన తర్వాత పీటర్ నవారో ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో ట్రంప్ విధించిన అదనపు టారిఫ్‌లు ఈ నెల 27 నుంచి అమలులోకి రానున్నాయి. దీంతో భారత వస్తువులపై అమెరికా సుంకాలు 50 శాతానికి చేరనున్నాయి.

## చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ తొలగించండి.. ప్రధానికి మంత్రి తుమ్మల లేఖ

హైదరాబాద్ : చేనేత ఉత్పత్తులపై వెంటనే జీఎస్టీ తొలగించాలని కోరుతూ ప్రధాని మోదీకి తెలంగాణ చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. కేంద్ర హస్త కళలు, చేనేత మంత్రిత్వ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు కూడా లేఖ పంపారు. రాష్ట్ర హస్తకళల పరిశ్రమకు ఊపిరిలాంటి చేనేత రంగం, చేనేత ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం విధించిన 5 శాతం జీఎస్టీతో ప్రస్తుతం ఆ రంగం తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటోందని ప్రధాని, కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పించే ఈ రంగం.. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో వేలాది మంది కార్మికులకు జీవనాధారమైందని పేర్కొన్నారు. "అందం, నాణ్యత, సృజనాత్మకతకు అద్దం పట్టే పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, నారాయణపేట చీరలు, సిద్ధిపేట గొల్లభామ చీరలు, వరంగల్ దర్రీస్, కరీంనగర్ డబుల్ క్లాత్ చెద్దర్లు, ఇతర చేనేత వస్త్రాలు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందాయి. వీటిలో ఆరు రకాల ఉత్పత్తులు జియోగ్రాఫికల్ ఇండికేషన్ కింద నమోదయ్యాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 23,046 మంది చేనేత కార్మికులు, 34,569 మంది అనుబంధ కార్మికులు ఈ రంగంలో పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ముడి సరకుల ధరలు పెరగడం, పవర్‌లూమ్, మిల్ రంగాలు తక్కువ ఉత్పత్తి వ్యయంతో వస్త్రాలు తయారు చేయడంతో మార్కెట్లో చేనేత వస్త్రాలు తయారు చేసే నేత కార్మికులకు గిరాకీ లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు 5 శాతం జీఎస్టీ విధించడం వల్ల చేనేత ఉత్పత్తుల ధరలు పెరిగి వినియోగం తగ్గిపోతుంది. కార్మికుల



జీవనాధారం సంక్షోభంలో పడుతోంది. జీఎస్టీ వల్ల నష్టపోతున్న నేతన్నలు తమ సంప్రదాయ వృత్తిని వదిలి వలస వెళ్లాల్సిన పరిస్థితి వస్తోంది. సాధారణంగా ఖాదీ రంగం, చేనేత రంగం రెండూ సహజ సిద్ధమైన గ్రామీణ పరిశ్రమలుగా ఒకే విధంగా ఉన్నప్పటికీ.. ఖాదీ ఉత్పత్తులపై జీఎస్టీ మినహాయింపు ఉండగా, చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ కొనసాగించడం అన్యాయం. రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలు, ఉత్పత్తిదారుల సంఘాలు, కార్మికులు ఈ పన్నును వ్యతిరేకిస్తూ నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో చేనేత కార్మికుల ప్రయోజనాలు కాపాడటంతోపాటు నిరంతరం ఉపాధి కల్పించేందుకు భారతీయ చేనేత కళా వారసత్వం భావితరాలకు అందించడానికి చేనేత ఉత్పత్తులపై 5 శాతం జీఎస్టీ మినహాయించే విధంగా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి"అని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

## హారన్ కొట్టాడని.. మెహదీపట్నంలో ఆర్టీసీ డ్రైవర్‌పై ఆటో డ్రైవర్ దాడి

హైదరాబాద్: ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఆటో డ్రైవర్ దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని మెహదీపట్నం రైతుబజార్ సమీపంలో చోటుచేసుకుంది. సైడ్ ఇవ్వకపోవడంతో బస్సు డ్రైవర్ హారన్ కొట్టాడు. దీంతో ఆగ్రహానికి గురైన ఆటో డ్రైవర్.. బస్సు వద్దకు వెళ్లి డ్రైవర్ సీటు కిటికీ పట్టుకుని బూతులు తిట్టాడు. అంతటితో ఆగకుండా బస్సు ఎక్కి మరీ అతడిపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై మెహదీపట్నం సీఐను వివరణ కోరగా.. ఫిర్యాదు చేస్తే నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.





## కాళేశ్వరంలో నీళ్లు లేకున్నా.. గోదావరి బేసిన్ ప్రాజెక్టుల్లో జలకళ: తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు లేకున్నా.. మేడిగడ్డ ఆనకట్ట కుంగినా, అన్నారం, సుందిళ్లలో నీటిని ఆపకున్నా వర్షాలతో గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ జలకళ సంతరించుకున్నాయని తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టులు నిండటంతో ఉత్తర తెలంగాణలో వరద కాల్వలతోపాటు మిడ్ మానేరు, ఎల్ఎండీలో క్రమంగా నీటి నిల్వలు పెరుగుతున్నాయని తెలిపింది. మహారాష్ట్ర, ఎగువన గోదావరి పరివాహకంలో కురిసిన వర్షాలతో ఎస్సారెస్పీకి మూడు రోజులుగా ఇన్ ఫ్లో కొనసాగుతోంది. సోమవారం మధ్యాహ్నం లక్షా 25వేల క్యూసెక్కులకు పైగా ఇన్ ఫ్లో ఉండగా.. ఔట్ ఫ్లో 76,867 క్యూసెక్కులకు పైగా ఉంది. కాకతీయ కాల్వకు 5,000 క్యూసెక్కులు, ఎస్సారెస్పీ నుంచి 18 వేల క్యూసెక్కుల నీటిని ఇందిరమ్మ వరద కాల్వ ద్వారా మిడ్ మానేరుకు వదులుతున్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వ 18.92 టీఎంసీలకు చేరుకొంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు. ఎల్లంపల్లి గరిష్ట నీటిమట్టం 148 మీటర్లు కాగా.. ప్రస్తుతం 147.55 మీటర్ల వద్ద నీటిమట్టం ఉంది. ఎస్సారెస్పీ పరివాహకంలో కురిసిన వర్షాలతో 48,293 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. ప్రాజెక్టు నుంచి హైదరాబాద్ తాగునీటితో పాటు ఎన్టీపీసీకి నీటిని విడుదల చేస్తున్నారు. నంది పంప్ హౌస్‌కు 6,300 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

# లాభాల్లోకి దేశీయ స్టాక్ మార్కెట్లు..

### సెన్సెక్స్ 676 పాయింట్లు జంప్.!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వారంలో తొలిరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 676 పాయింట్లు, నిఫ్టీ 250 పాయింట్లకుపైగా పెరిగింది. దీపావళి నాటికి జీఎస్టీ వ్యవస్థను మారుస్తామన్న కేంద్రం ప్రకటన నేపథ్యంలో ఆటోమొబైల్‌తో పాటు పలు కంపెనీల షేర్లలో భారీగా కొనుగోళ్లకు దారి తీసింది. బెంచ్‌మార్క్ సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు ఒక శాతం వరకు లాభాలను నమోదు చేశాయి. గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ ఎస్అండ్‌పీ భారతదేశ సావరిన్ క్రెడిట్ రేటింగ్‌ను అప్‌గ్రేడ్ చేయడం కూడా మార్కెట్‌పై సానుకూల ప్రభావాన్ని చూపిందని మార్కెట్ పండితులు పేర్కొంటున్నారు. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,315.79 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఆ తర్వాత ఇంట్రాడేలో 81,202.42 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. గరిష్టంగా 81,765.77 పాయింట్లకు పెరిగింది. చివరకు 676.09 పాయింట్ల లాభంతో 81,273.75 వద్ద ముగిసింది. నిఫ్టీ 251.20 పెరిగి 24,882.50 వద్ద స్థిరపడింది. దాదాపు 2446 షేర్లు లాభపడ్డాయి. 1,555 షేర్లు నష్టపోయాయి. నిఫ్టీలో మారుతి సుజుకి, నెస్లే, హీరో మోటోకార్ప్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఆటో అత్యధికంగా లాభపడ్డాయి. ఐటీసీ, టెక్ మహీంద్రా, ఎటర్నల్, ఎల్ అండ్ డీ, ఎ న్‌టీపీసీ నష్టపోయాయి. ఐటీ, మీడియా, విద్యుత్ మినహా మిగతా అన్ని రంగాలు ఆటో ఇండెక్స్ 4 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్ ఇండెక్స్ 3 శాతం, రియాలిటీ 2 శాతం, మెటల్, ఎఫ్ఎంసీజీ, టెలికాం, ప్రైవేట్ బ్యాంక్ ఒకటి నుంచి 2 శాతం పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఒక శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.4 శాతం పెరిగాయి. ఆటో షేర్లకు మంచి డిమాండ్ కనిపించింది. హ్యుందాయ్ మోటార్ ఇండియా స్టాక్ 8.45 శాతం పెరిగింది. బీఎస్ఈ ఆటో ఇండెక్స్ 4.26 శాతం పెరిగి 56,233.33కి చేరుకుంది. జపాన్‌కు చెందిన నిక్కీ 225 ఇండెక్స్, షాంఘైకి చెందిన ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్ సానుకూలంగా ముగిశాయి. దక్షిణ కొరియాకు చెందిన కోస్పి, హాంకాంగ్‌కు చెందిన హాంగ్ సెంగ్ నష్టపోయింది. యూరోపియన్ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. గ్లోబల్ ఆయిల్ బెంచ్ మార్క్ బ్రెంట్ క్రూడ్ 0.62 శాతం పెరిగి బ్యారెల్‌కు 66.25 డాలర్లకు చేరుకుంది.

## ఆల్ టైమ్ హైకి చేరుకున్న భారతదేశ ఫారెక్స్, బంగారం నిల్వలు..



**న్యూఢిల్లీ:** దేశం మొత్తం 79వ స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపుకుంటున్న వేళ, విదేశీ మారక ద్రవ్య నిల్వల గురించి శుభవార్త వచ్చింది. ఆగస్టు 8తో ముగిసిన వారంలో, మన విదేశీ మారక ద్రవ్య నిల్వలు 4.74 బిలియన్లకు పైగా పెరిగాయి. ఈ వారం, బంగారు నిల్వలలో గణనీయమైన పెరుగుదల నమోదు చేసుకుంది. ఆగస్టు 1తో ముగిసిన వారంలో, మన విదేశీ మారక ద్రవ్య నిల్వలలో 9.3 బిలియన్ల భారీ తగ్గుదల ఉంది.

శుక్రవారం(ఆగస్టు 15) నాడు భారత రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన డేటా ప్రకారం, ఆగస్టు 8, 2025 తో ముగిసిన వారంలో భారతదేశ విదేశీ మారక నిల్వలు 4.747 బిలియన్లు పెరిగాయి. ఒక వారం ముందు, ఇది 9.322 బిలియన్లు తగ్గింది. ఇప్పుడు దాని నిల్వలు 693.618 బిలియన్లకు పెరిగాయి. సెప్టెంబర్ 27, 2024 తో ముగిసిన వారంలో, దాని విదేశీ మారక నిల్వలు రికార్డు స్థాయిలో 704.885 బిలియన్ల వద్ద ఉండటం గమనించదగ్గ విషయం.

రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన వారపు డేటా ప్రకారం, వారంలో భారతదేశ విదేశీ కరెన్సీ ఆస్తులు పెరిగాయి. ఆగస్టు 8, 2025తో ముగిసిన వారంలో, భారతదేశ విదేశీ కరెన్సీ ఆస్తులు 2.372 బిలియన్లు పెరిగాయి. అంతకుముందు, ఇది 7.319 బిలియన్లు తగ్గింది. ఇప్పుడు దాని నిల్వలు 583.979 బిలియన్లకు పెరిగాయి. విదేశీ కరెన్సీ ఆస్తులు లేదా విదేశీ కరెన్సీ ఆస్తులు దేశం మొత్తం విదేశీ మారక నిల్వలలో ముఖ్య భాగంగా ఉన్నాయని గమనించాలి. డాలర్ల రూపంలో విదేశీ కరెన్సీ ఆస్తులలో యూరో, పౌండ్, యెన్ వంటి యేతర కరెన్సీలలో హెచ్చుతగ్గుల ప్రభావాలు కూడా ఉన్నాయి. రూపాయి విలువ భారీగా తగ్గకుండా నిరోధించడానికి, డాలర్ల అమ్మకంతో సహా ద్రవ్యతను నిర్వహించడం ద్వారా ఆర్‌బిఐ తరచుగా జోక్యం చేసుకుంటుంది. రూపాయి బలంగా ఉన్నప్పుడు ఆర్‌బిఐ వ్యూహాత్మకంగా డాలర్లను కొనుగోలు చేస్తుంది. బలహీనపడినప్పుడు విక్రయిస్తుంది.

గత వారంలో మన బంగారు నిల్వలు కూడా పెరిగాయి. రిజర్వ్ బ్యాంక్ ప్రకారం, ఆగస్టు 8న మన బంగారు నిల్వలు 2.162 బిలియన్లు పెరిగాయి. దీనికి వారం ముందు, 1.706 బిలియన్ల తగ్గుదల కనిపించింది. దీంతో, మన బంగారు నిల్వలు ఇప్పుడు 86.160 బిలియన్ డాలర్లకు చేరుకుంది. రిజర్వ్ బ్యాంక్ డేటా ప్రకారం, గత వారంలో భారతదేశ స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ కూడా పెరిగింది. 169 మిలియన్లు పెరిగింది. ఇప్పుడు అది 18.741 బిలియన్లకు పెరిగింది. దీనికి వారం ముందు, ఇది 237 మిలియన్లు తగ్గింది. ఈ వారం, అంతర్జాతీయ ద్రవ్య నిధి వద్ద ఉంచిన భారతదేశ రిజర్వ్ కరెన్సీ కూడా 45 మిలియన్లు పెరిగింది. ఇప్పుడు అది 4.739 బిలియన్లకు పెరిగింది.

## ఫాస్టాగ్ వార్షిక పాస్‌కు భారీ డిమాండ్..



**న్యూఢిల్లీ:** జాతీయ రహదారులు, జాతీయ ఎక్స్‌ప్రెస్‌వేలపై ప్రయాణించే వాణిజ్యేతర వాహనదారుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఫాస్టాగ్ వార్షిక పాస్‌కు విపరీతమైన స్పందన వచ్చింది. దేశవ్యాప్తంగా 1,150కి పైగా జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేల టోల్ ప్లాజాల్లో ఆగస్టు15న ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. అదే రోజు సాయంత్రం 7 గంటల వరకు సుమారు 1.4 లక్షల వాహనదారులు ఈ పాస్‌ను కొనుగోలు చేసి యాక్టివేట్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఫాస్టాగ్ వార్షిక పాస్‌ను తొలిరోజు 1.39 లక్షలకుపైగా లావాదేవీలు నమోదయ్యాయి. అదే సమయంలో రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌లో ఏకకాలంలో 20 నుంచి 25 వేల మంది వినియోగదార్లు లాగిన్ అవుతున్నట్లు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ తెలిపింది. రూ.3 వేలతో ఫాస్టాగ్ టోల్‌పాస్ తీసుకునే కార్లు, జీపులు, వ్యాన్ల యజమానులు ఏడాది పాటు లేదా 200 ట్రిప్పుల వరకు(ఏది ముందైతే అది) జాతీయ రహదారులపై ప్రయాణించవచ్చు. ఇది వ్యక్తిగత కార్లు జీపులు, వ్యాన్లకు మాత్రమే వర్తిస్తుంది. వాణిజ్య వాహనాలకు చెల్లుబాటు కాదు. 200 ట్రిప్పులు పూర్తయ్యాక మళ్లీ రూ.3 వేలతో యాక్టివేట్ చేసుకోవాల్సి ఉంటుంది.

ఇలా ఏడాదిలో ఫాస్టాగ్ టోల్‌పాస్ ఎన్నిసార్లైనా చేసుకోవచ్చు. ఇప్పటికే ఫాస్టాగ్ ఉన్నవారు మళ్లీ కొత్త ఫాస్టాగ్ కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. పాత ఫాస్టాగ్‌తోనే టోల్‌పాస్ యాక్టివేట్ చేసుకోవచ్చు. రాజ్‌మార్గ్ యాత్ర యాప్ లేదా వెబ్‌సైట్లలో అందుబాటులో ఉన్న లింక్ ద్వారా ఈ వార్షిక పాస్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు.



# స్వియాటెక్ అలవోకగా..

### చెమటోడ్చి ఫైనల్ చేరిన ఇటలీ కెరటం

**న్యూయార్క్:** వరల్డ్ మూడో సీడ్ ఇగా స్వియాటెక్ కోర్టులో యూఎస్ ఓపెన్ సన్నాహక టోర్నీలో జోరు చూపిస్తోంది. ఈమధ్యే వింబుల్డన్ విజేతగా నిలిచిన ఆమె సిన్సినాటి ఓపెన్ టోర్నమెంట్ ఫైనల్లో అడుగుపెట్టింది. ఉత్కంఠగ సాగిన సెమీఫైనల్లో ఎలీనా రిబాకినాను చిత్తుగా ఓడించింది. రెండో సెమీస్‌లో ఏడోసీడ్ జాస్మినె పాలొని అతికష్టమ్మీద గెలిచింది. తద్వారా రెండోసారి డబ్ల్యూటీఏ 1000 ఫైనల్‌కు దూసుకెళ్లింది.

సెమీఫైనల్లో రిబాకినా హెూరాహెూరీగా తలపడ్డారు. తొలిసెట్‌ను 7-5తో గెలుచుకున్న స్వియాటెక్ రెండో సెట్‌లో మరింత దూకుడు కనబరిచింది. రెండో ఫైనలిస్ట్ జాస్మినే పాలోని (ఇటలీ) మాత్రం చెమటోడ్చాల్సి వచ్చింది. అన్‌సీడెడ్ వెరోనికా కుదెర్మోటోవా ధాటికి రెండో సెట్ కోల్పోయినా.. ఆ తర్వాత పుంజుకొని మూడో సెట్ కైవసం చేసుకుంది. పాలోని-స్వియాటెక్ మ్యాచ్ విషయానికొస్తే.. మెరుగైన రికార్డు ఉంది. ఇప్పటివరకూ ఇరువురు ఐదుసార్లు తలపడగా అన్నింటా విజయం సాధించింది. ఆగస్టు 24నుంచి యూఎస్ ఓపెన్ ప్రారంభం అవుతుంది.

# వరల్డ్ కప్ బరిలో అమెరికా, టాంజానియా..



**న్యూయార్క్:** పురుషుల అండర్ -19 వరల్డ్ కప్ పోటీలకు అమెరికా అర్హత సాధించింది. క్వాలిఫయర్స్‌లో అద్భుత ప్రదర్శనతో ప్రపంచ కప్ బెర్తు సాధించింది యూఎస్ఏ. దాంతో, మెగా టోర్నీ బరిలో నిలిచిన జట్ల సంఖ్య 16కు చేరింది. రెండేళ్ల క్రితం టాప్-10లో నిలిచిన జట్లతో పాటు ఆతిథ్య జింబాబ్వే అర్హత సాధించింది. మిగతా ఆరు స్థానాలను క్వాలిఫయర్స్ విజేతలు సొంతం చేసుకున్నాయి. జింబాబ్వే, నమీబియా వేదికగా వచ్చే ఏడాది అండర్ -19 ప్రపంచ కప్ జరుగనుంది.

గత ఎడిషన్ ఫైనల్ చేరిన భారత్, ఆస్ట్రేలియాతో పాటు ఇంగ్లండ్, ఐర్లాండ్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, వెస్టిండీస్ నేరుగా అర్హత సాధించాయి. ఆసియా క్వాలిఫయర్‌లో మెరుగైన రన్‌రేటు కారణంగా అఫ్గనిస్థాన్, ఆఫ్రికా క్వాలిఫయర్‌లో నమీబియాను ఓడించిన టాంజానియా బెర్తు దక్కించుకున్నాయి.

రౌండ్ రాబిన్ పద్ధతిలో నిర్వహించనున్న ఈ టోర్నీలో ఒక్కో దాంట్లో నాలుగు చొప్పున నాలుగు గ్రూప్‌లు ఉంటాయి. ఈస్ట్ ఆసియా ఫసిఫిక్ క్వాలిఫయర్‌లో ఆడిన జపాన్, స్కాంట్లండ్ క్వాలిఫై అయ్యాయి. అమెరికా క్వాలిఫయర్స్‌లో కెనడా, బెర్ముడా, అర్జెంటీనాకు షాకిచ్చిన అమెరికా వరల్డ్ కప్ రేసులోకి దూసుకొచ్చింది.

వరల్డ్ కప్ బరిలో ఉన్న జట్లు ఇవే.. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, న్యూజిలాండ్, శ్రీలంక, ఐర్లాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వే, అఫ్గనిస్థాన్, జపాన్, స్కాట్లాండ్, టాంజానియా, యూఎస్ఏ.

# గాయంతో ఇషాన్ కిషన్ ఔట్

### దేశవాళీ హీరోకు కెప్టెన్సీ..!



**న్యూఢిల్లీ:** ఏడాది కాలంగా జట్టుకు దూరమైన ఇషాన్ కిషన్ ఆసియా కప్ ముందే గాయపడ్డాడు. దేశవాళీ క్రికెట్‌లో అదరగొట్టి.. పునరాగమనం చేస్తాడనుకుంటే.. దులీఫ్ ట్రోఫీ నుంచి అనూహ్యంగా దూరమయ్యాడు. ఈస్ట్ జోన్ సారథిగా ఎంపికైన ఈ చిచ్చరపిడుగు మెగా టోర్నీలో ఆడడం లేదని ధ్రువీకరించిన ఒడిశా క్రికెట్ సంఘం అతడి స్థానంలో మరో ఆటగాడిని తీసుకుంది. ఇషాన్ బదులు 27 ఏళ్ల ఆశీర్వాద్ స్వెయిన్‌ను స్క్వాడ్‌లోకి రాగా.. వైస్ కెప్టెన్‌గా ఉన్న అభిమన్యు ఈశ్వరన్ జట్టును నడిపిస్తాడని ఈస్ట్ జోన్ సెలెక్టర్లు తెలిపారు.

'ఇషాన్ కిషన్ గాయంతో దులీప్ ట్రోఫీకి దూరమయ్యాడు. అతడి స్థానంలో ఒడిశా వికెట్ కీపర్, బ్యాటర్ ఆశీర్వాద్ స్వెయిన్ ఈస్ట్ జోన్ స్క్వాడ్‌లోకి తీసుకున్నాం. సందీప్ పట్నాయక్‌కు అతడు బ్యాకప్‌గా ఉంటాడు. యువకెరటం స్వస్తిక్ సమాల్‌ను స్టాండ్ బైగా ఎంపిక చేశాం' అని ఒడిశా క్రికెట్ సంఘం సోమవారం ఎక్స్ వేదికగా వెల్లడించింది. దులీప్ ట్రోఫీలో ఆగస్టు 28న నార్త్ జోన్‌తో ఈస్ట్ జోన్ తలపడనుంది.

ఐపీఎల్ 18వ సీజన్‌లో సెంచరీతో మెరిసిన ఇషాన్ జాతీయ జట్టులో చోటు కోసం నిరీక్షిస్తున్నాడు. అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీ మాంచెస్టర్ టెస్టులో పంత్ గాయపడిన తర్వాత అతడికి పిలుపు వస్తుందని ఊహించారంతా. కానీ, ఇషాన్ మాత్రం అయిష్టం చూపించడంతో తమిళనాడుకు చెందిన ఎన్ జగదీశన్‌ను ఎంపిక చేశారు సెలెక్టర్లు.

**ఈస్ట్ జోన్ స్క్వాడ్:** అభిమన్యు ఈశ్వరన్(కెప్టెన్), సందీప్ పట్నాయక్, విరాట్ సింగ్, దినేశ్ దాస్, శ్రీదామ్ పాల్, శరన్‌దీప్ సింగ్, కుమార్ కుషగ్ర, రియాన్ పరాగ్, ఉత్కర్ష్ సింగ్, మనీషి, సూరజ్ సింధు జైస్వాల్, ముకేశ్ కుమార్, మహ్మద్ షమీ, ఆశీర్వాద్ స్వెయిన్.

స్టాండ్ బై ప్లేయర్లు : ముఖ్తర్ హుస్సేన్, వైభవ్ సూర్యవంశీ, స్వస్తిక్ సమాల్, సుదీప్ కుమార్, రాహుల్ సింగ్.

# హర్యానా స్టీలర్స్ కెప్టెన్‌గా సూపర్ డిఫెండర్..



**న్యూఢిల్లీ:** ప్రో కబడ్డీ లీగ్ పదకొండో సీజన్ ఛాంపియన్ హర్యానా స్టీలర్స్ మరో టైటిల్ కోసం పక్కాగా సన్నద్ధమవుతోంది. 12వ సీజన్‌లోనూ ట్రోఫీతో చరిత్ర సృష్టించాలనుకుంటున్న హర్యానా ఫ్రాంచైజీ సూపర్ డిఫెండర్ జైదీప్ దహియాకు మరోసారి కెప్టెన్సీ అప్పగించింది. తొలిసారి తమ జట్టు పీకేఎల్ విజేతగా అవతరించడంలో కీలక పాత్ర పోషించిన దహియాకు.. రాహుల్ సేథ్‌పాల్ వైస్ కెప్టెన్‌గా ఉంటాడని యాజమాన్యం తెలిపింది. మ్యాచ్ సమయంలో వేగంగా, తెలివిగా నిర్ణయాలు తీసుకోగల నైపుణ్యం ఉన్నందున ఈ ఇద్దరిని ఎంపకి చేశామని కోచ్ మన్‌ప్రీత్ సింగ్ వెల్లడించాడు.

'కబడ్డీ ఆటలో ఐకమత్యంతో పాటు వేగంగా నిర్ణయం తీసుకునే నేర్పూ ఉండాలి. జైదీప్, రాహుల్‌కు ఈ రెండు నైపుణ్యాలు ఉన్నాయి. ఇద్దరూ మ్యాట్ మీద ప్రత్యర్థి ఎత్తులను చిత్తు చేయడంలో ఇద్దరు ది బెస్ట్. క్రమశిక్షణ, నిలకడ.. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి గత సీజన్‌లో మా జట్టు ఛాంపియన్‌గా నిలవడంలో జైదీప్, రాహుల్ కీలక పాత్ర పోషించారు. ఈ ఏడాది కూడా మేము టైటిల్‌పై కన్నేశాం' అని కోచ్ మన్‌ప్రత్ సింగ్ అన్నాడు.

పీకేఎల్ స్టార్ అయిన జైదీప్ దహియా హర్యానా జట్టుకు కొన్నాళ్లుగా ఆడుతున్నాడు. 87 మ్యాచుల్లో 231 రైడ్ పాయింట్లు సాధించిన దహియా.. డిఫెన్స్‌లోనూ సత్తా చాటి 227 పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. రాహుల్ కూడా హర్యానా బెస్ట్ ప్లేయర్. గత సీజన్‌లో అతడు 24 మ్యాచుల్లో 73 టాకిల్ పాయింట్లతో రాణించాడు.

### హర్యానా స్టీలర్స్ స్క్వాడ్

**రైడర్స్:** నవీన్ కుమార్, శివం పతారే, వినయ్ తెవాటియా, షాహన్ షా మహమ్మద్, ఘనశ్యామ్ రొకా మగర్, మయాంక్ సైనీ, జయసూర్య ఎన్ఎస్, విశాల్ తటే, వికాస్ జాదవ్. ఢిఫెండర్లు : జైదీప్ దహియా, రాహుల్ సేథ్‌పల్, రాహుల్ అహ్రి, రితికా గుర్జర్, జుబైర్ మాలిక్, హర్దీప్ కండోలా, అంకిత్ ధుల్, సచిన్ దహియా, ఎన్ మణికందన్. ఆల్‌రౌండర్లు : అశిష్ నర్వాల్, సహిల్ నర్వాల్.

ప్రో కబడ్డీ లీగ్-11వ సీజన్ టైటిల్‌ను హర్యానా స్టీలర్స్ తొలిసారి దక్కించుకుంది. సీజన్ ఆరంభం నుంచి టేబుల్ టాపర్‌గా ఉంటూ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఫైనల్ చేరిన ఆ జట్టు.. టైటిల్ పోరులో 32-23తో పాట్నా పైరేట్స్‌ను మట్టికరిపించింది. గతేడాది ఫైనల్‌లో పూణెరి పల్టన్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచిన హర్యానా ఈసారి మాత్రం పట్టు విడవకుండా టోర్నీ ఆసాంతం అదరగొట్టి తమ కప్ కలను సాకారం చేసుకుంది. తొలి అర్ధ భాగం ముగిసేసరికి 15-12తో ఆధిక్యంలో ఉన్న హర్యానా.. సెకండాఫ్‌లో మరింత జోరు పెంచింది. హర్యానా తరఫున రైడర్ శివమ్ పటారె 9 పాయింట్లతో సత్తా చాటగా ఆల్‌రౌండర్ షాద్లోయ్ (7), వినయ్ (6) ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

## ఇంటివాడు కాబోతున్న గాయకుడు సిప్లిగంజ్

### ప్రేమికురాలు హరిణిరెడ్డితో నిశ్చితార్థం

**టాకీస్:** బిగ్ బాస్ సీజన్ 3 విజేత, 'నాటు- నాటు-' పాటతో ఆస్కార్ వేదికపై తెలుగు పాటను నిలబెట్టిన గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ ఓ ఇంటివాడయ్యాడు. తన ప్రేమికురాలు హరిణి రెడ్డితో ఇటీవల నిశ్చితార్థం జరుపుకున్నారు. ప్రస్తుతం వీరిద్దరి ఎంగేజ్‌మెంట్ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఎప్పుడూ తన వ్యక్తిగత విషయాలను అభిమానులతో పంచుకుంటూ కనిపించే రాహుల్ ఈసారి మాత్రం తన నిశ్చితార్థ వేడుకను చాలా ప్రైవేట్‌గా ఉంచారు. ఎటువంటి అధికారిక ప్రకటన చేయకపోయిన, వారికి సంబంధించిన ఒక ఫొటో సోషల్ మీడియాలో ప్రత్యక్షం కావడంతో ఇది వెలుగులోకి వచ్చింది.

ఫొటోలో రాహుల్, హరిణి రెడ్డి కలర్ ఫుల్ డ్రెస్సుల్లో మెరిసిపోయారు. రాహుల్ పాస్టెల్ లావెండర్ షేర్వానీలో రాయల్ లుక్‌లో కనిపించగా, హరిణి ఆరెంజ్ కలర్ లెహంగాను ధరించి తళుక్కుమంది. ఈ జంటని చూసిన వారంతా కూడా చూడముచ్చటగా ఉందంటు-న్నారు. మరి పెళ్లి ఎప్పుడు చేసుకుంటారు అనే దానిపై క్లారిటీ- రావలసి ఉంది. హరిణి రెడ్డి గురించి ఇంకా పూర్తి సమాచారం లేనప్పటికీ, ఆమె



కూడా టాలీవుడ్ ఇండస్ట్రీకి సంబంధించిన వ్యక్తిగానే భావిస్తున్నారు. యాంకర్ విష్ణుప్రియ, సింగర్ నోయల్, స్రవంతి చొక్కారపు, గీతా మాధురి, అరియానా, సన్నీ, జబర్దస్త్ రోహిణి, కరుణ భూషణ్ వంటి పలువురు ఇండస్ట్రీ ప్రముఖులు ఆమెను ఫాలో అవుతున్నారు. ఈ శుభవార్త బయటకు వచ్చాక, రాహుల్ అభిమానులు సోషల్ మీడియాలో కంగ్రాట్స్ చెబుతున్నారు. గతంలో రాహుల్ సిప్లిగంజ్.. అషూ రెడ్డితో ప్రేమలో ఉన్నారని జోరుగా ప్రచారం సాగింది. ఇప్పుడు వాటన్నింటికి పులిస్టాప్ పడింది. ఇక రాహుల్ ప్రస్తుతం సింగర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు. 'మరిపాలే', 'బోనాలే', 'పెడవలే పడితేనా', 'ఊహలు గుసగుసలాడే', 'నాటు- నాటు-' వంటి ఎన్నో హిట్ సాంగ్స్‌తో యువతను అలరిస్తూ వస్తున్నాడు. పర్సనల్ లైఫ్‌లో కూడా గుడ్ న్యూస్ చెప్పి ఫ్యాన్స్‌ని ఖుషీ చేశాడు.

## కేక పెట్టించిన కృతి పాప..

### బేబమ్మ అందాలతో అదరగొట్టిందిగా..

**టాకీస్:** కృతి శెట్టి తెలుగు, తమిళ సినిమాల్లో పని చేస్తూ బిజీగా ఉంటుంది. ఈ ముద్దుగుమ్మ 2003 సెప్టెంబరు 21న కర్ణాటకలోని మంగళూరులో జన్మించింది, ముంబైలో పెరిగింది. ఆమె తండ్రి కృష్ణ శెట్టి వ్యాపారవేత్త, తల్లి నీతి శెట్టి ఫ్యాషన్ డిజైనర్. చిన్నతనం కృతి శెట్టి ఐడియా, షాపర్స్ స్టాప్, పార్లే, లైఫ్‌బాయ్ వంటి పలు బ్రాండ్‌ల వాణిజ్య ప్రకటనల్లో నటించింది. ఇక ఈ ముద్దుగుమ్మ తన కెరీర్ ను చైల్డ్ ఆర్టిస్ట్ గా ఇండస్ట్రీకి పరిచయం అయ్యింది. కృతి 2019లో హిందీ చిత్రం సూపర్ 30లో చిన్న పాత్రతో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. కృతిశెట్టికి 2021లో వచ్చిన తెలుగు చిత్రం ఉప్పెనతో గుర్తింపు లభించింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా వసూలు చేసి విజయం సాధించింది. బుచ్చిబాబు సన దర్శకత్వంలో తెరకెక్కిన ఉప్పెన సినిమా భారీ విజయాన్ని అందుకుంది. అలాగే ఈ సినిమాలో కృతిశెట్టి నటనకు ప్రశంసలు అందాయి. ఆ తర్వాత ఆమె శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు వంటి చిత్రాల్లో నటించి వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించింది. అయితే, ఆ తర్వాత ది వారియర్, మాచర్ల నియోజకవర్గం, కస్టడీ, మనమే వంటి కొన్ని చిత్రాలు కమర్షియల్ గా నిరాశపరిచాయి. దీంతో తెలుగులో కృతిశెట్టికి అవకాశాలు తగ్గాయి. ప్రస్తుతం ఈ చిన్నది తమిళ సినిమాలపై దృష్టి సారించింది. మూడు తమిళ ప్రాజెక్టుల్లో నటిస్తోంది. ప్రస్తుతం ఈ చిన్నది ప్రదీప్ రంగనాథ్ సరసన ఓ సినిమాలో నటిస్తుంది. లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ అనే టైటిల్ తో ఈ సినిమా తెరకెక్కుతుంది. ఈ సినిమాకు విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇక కృతిశెట్టి సినిమాల స్పీడ్ తగ్గించేసింది. కెరీర్ బిగినింగ్ లో వరుస సినిమా ఆఫర్స్ అందుకున్న ఈ చిన్నది. ఆతర్వాత ఆఫర్స్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఎదురైంది. ఉప్పెన సినిమా, బంగార్రాజు, శ్యామ్ సింగరాయ్ సినిమాతర్వాత చేసిన సినిమాలన్నీ ఫ్లాప్ అయ్యాయి. ప్రస్తుతం సినిమాలతో కంటే సోషల్ మీడియాతో బిజీగా మారిపోయింది ఈ చిన్నది.




## విడుదలకు సిద్ధంగా అనుష్క ఘాటి

**టాకీస్:** టాలీవుడ్ బ్యూటీ అనుష్కా శెట్టి నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం ఘాటి క్రిష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. కాగా మేకర్స్ మ్యూజికల్ అప్‌డేట్ అందించారు. ఈ మూవీ నుంచి సెకండ్ సింగిల్ అప్‌డేట్ అందించారు మేకర్స్. దస్సోరా సాంగ్‌ను ఆగస్టు 20న గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నట్టు- కొత్త లుక్ విడుదల చేశారు. విక్రమ్ ప్రభు, అనుష్క తమ భుజాలపై భారీ మూటలు మోస్తూ కొండలపై నుంచి వస్తున్న లుక్ పాటపై హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ పాటను నాగవెల్లి విద్యాసాగర్ కంపోజ్ చేశాడు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్-టైన్‌మెంట్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో చైతన్య రావ్, జగపతి బాబు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఏప్రిల్‌లోనే విడుదల కావాల్సిన ఈ చిత్రం వాయిదా పడుతూ వస్తోన్న నేపథ్యంలో నిరాశ చెందుతున్న అభిమానులు, ఫాలోవర్లు ప్రమోషన్స్‌ను వేగవంతం చేయాలని అనుష్క టీంకు రిక్వెస్ట్‌లు పెడుతున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి విడుదల చేసిన జనాలంతా కొండ ప్రాంతం మధ్యలోని దారి వెంట మూటలు మోసుకొని వెళ్తున్న లుక్‌తోపాటు- గ్లింప్స్ సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ఘాటి అమెజాన్ ప్రైమ్ వీడియోలో పోస్ట్ థియాట్రికల్ రిలీజ్ కానుంది.




## హీరో సూర్యతో వెంకీ అట్లూరి మూవీ



టాకీస్: కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రస్తుతం తన 46వ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం చుట్టూ ఇప్పటికే మంచి హైప్ క్రియేట్ అయింది. అయితే ఈ సినిమాలో బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ నటించనున్నారన్న వార్తలు ఇటీవల వైరల్ అయ్యాయి. ఈ రూమర్స్‌పై తాజాగా దర్శకుడు వెంకీ అట్లూరి స్పందిస్తూ.. అనిల్‌కపూర్‌ను మేము ఎప్పుడూ కలవలేదు. ఆయనతో ఫోన్‌లో కూడా మాట్లాడలేదు. కానీ, ఎక్కడి నుంచి ఈ వార్తలు పుట్టుకొచ్చాయో మాకు తెలియదు. ఇలాంటి రూమర్స్‌ను నమ్మకండి. అధికారికంగా మేము చెప్పిన సమాచారాన్నే నమ్మండని స్పష్టం చేశారు. 'సార్', 'లక్కీ భాస్కర్' సినిమాల తర్వాత వెంకీ అట్లూరి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా మీద అంచనాలు రెట్టింపయ్యాయి. ఇందులో మమితాబైజు హీరోయిన్‌గా, అలాగే రవీనా టాండన్, రాధిక శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఈ 'సూర్య 46' చిత్రం తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందుతోంది. మేకర్స్ ఈ సినిమాను వచ్చే 2026 వేసవిలో విడుదల చేయాలని భావిస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఇటీ-వల రిలీజ్ చేసిన సూర్య బర్త్ డే పోస్టర్ కు మంచి స్పందన లభించింది.

### రాజమౌళి చేతుల మీదుగా విడుదలైన

## రావు బహదూర్ టీజర్..

**టాకీస్:** టాలీవుడ్ టాలెంటెడ్ యాక్టర్ సత్యదేవ్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. ఎన్నో సినిమాలలో వైవిధ్యమైన పాత్రలు పోషించి మెప్పించార . బ్లఫ్ మాస్టర్ సినిమా తర్వాత ఆయన నటనకు చాలామంది ఫిదా అయ్యారు. ఇటీవల జీబ్రా చిత్రంతో ఆకట్టుకున్న సత్యదేవ్ ఇప్పుడు రావు బహదూర్ అనే చిత్రంతో మరింత వినోదం పంచబోతున్నాడు. ఆయన నుంచి ఇంకా ఎక్కువ ఆశిస్తున్న వారికి ఈ మూవీ సమాధానం చెప్పేల కనిపిస్తుంది. "రావు బహదూర్" అనే టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో సత్యదేవ్ పూర్తిగా భిన్నమైన లుక్‌లో కనిపించాడు.



ఇటీవల విడుదలైన పోస్టర్‌ని చూసి ఇది ఫాంటసీ డ్రామా కానుందా? అనే ఆసక్తి కలుగుతుంది. ఈ చిత్రాన్ని కేరాఫ్ కంచరపాలెం దర్శకుడు వెంకటేష్ మహా తెరకెక్కిస్తున్నారు."అనుమానం పెనుభూతం" అనే లైన్‌ను హైలైట్ చేస్తున్న నేపథ్యంలో ఇందులో ఊహించని ట్విస్ట్‌లు ఉంటాయని అర్థమవుతుంది.తాజాగా మూవీ టీజర్ రాజమౌళి చేతుల మీదుగా విడుదల చేశారు. టీజర్.. నాకు అనుమానం అనే భూతం పట్టిందనే ఆసక్తికర డైలాగ్‌తో ప్రారంభమైంది. సన్నివేశాలు ఇంట్రెస్టింగ్‌గా ఉన్నాయి. సైకలాజికల్ డ్రామాగా దీనిని తీర్చి దిద్దినట్టు టీజర్ చూస్తుంటే తెలుస్తుంది. వచ్చే సమ్మర్‌కి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు.

ఈ చిత్రం ద్వారా సత్యదేవ్ నుంచి ప్రేక్షకులు కోరుకునే కొత్తదనం మళ్ళీ ఆయనలో చూడబోతున్నామని, మహేశ్వర ఉగ్రరూపస్య తరహా ఇంపాక్ట్‌ను వెంకటేష్ మహా మళ్ళీ అందించబోతున్నాడని అనిపిస్తోంది. ఈ చిత్రాన్ని శ్రీచక్ర ఎంటర్టైన్మెంట్స్, ఏ ప్లస్ ఎస్ సినిమాస్ నిర్మిస్తుండగా, సూపర్ స్టార్ మహేష్ బాబు, నమ్రత శిరోద్కర్ సమర్పిస్తున్నారు. 'రావు బహదూర్' అనేది ఓ రాజవంశం నేపథ్యంలో సాగే ఒక సైకలాజికల్ డ్రామా. దీనికి కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం, ఎడిటింగ్ వెంకటేష్ మహానే చేశారు. స్మరణ్ సాయి సంగీతం సమకూరుస్తుండగా.. కార్తీక్ పర్మార్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. రోహన్ సింగ్ ప్రొడక్షన్ డిజైనర్ గా వర్క్ చేస్తున్న ఈ చిత్రానికి దినేష్ యాదవ్ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.